మావోయిస్టు అగ్రనేత
# లొంగుబాటు!
**దేవ్‌జీ పాటు మల్లా రాజిరెడ్డి సహా 25 మంది కూడా..**

- తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు
- ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం వెల్లడి
- నేడో, రేపో రాష్ట్ర పోలీసుల ప్రకటన
- సీఎం రేవంత్ సమక్షంలో లొంగుబాటును చూపే అవకాశం




మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

23.2.2026 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 305 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar




సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


# వడ్డీ భారం..
## కూలుతున్న కుటుంబాలు...

**రికవరీ ఒత్తిడిపై ఆందోళనలు**

- ఒక ఫోన్ కాల్‌తో మొదలైన భయం...
- వడ్డీ ఒత్తిడితో వణికిన కుటుంబం
- రుణ వసూళ్ల ఒత్తిడిపై రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న ఫిర్యాదులు
- చట్టాల అమలు, పర్యవేక్షణపై ప్రశ్నలు












యాంసాని శివ కుమార్ (ఎడిటర్) జనతా న్యూస్



03

రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ
# పూర్తి చేస్తాం
## కాళేశ్వరాన్ని గాలికి వదిలేయం

- అది ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్టు.. వినియోగంలోకి తెస్తాం
- గత సర్కారు కాళేశ్వరానికే రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేసింది
- మిగతా ప్రాజెక్టుల్ని నిర్లక్ష్యం చేయడంతో భూసేకరణకు ఇబ్బందులు
- 6వేల కోట్లతో మొదలెట్టిన దేవాదుల 18,500 కోట్లకు చేరింది
- దేవాదులపై సమీక్ష.. మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 2లో..

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. నిధులన్నీ ఆ ఒక్క ప్రాజెక్టుకే ఖర్చు చేసి, మిగతా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో ప్రస్తుతం భూసేకరణకు నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును గాలికి వదిలేయబోమని, అది ప్రజల సొమ్ముతో నిర్మించినదని అన్నారు.

- జనతా న్యూస్

# గ్లోబల్ ఈవెంట్‌లో నగ్న రాజకీయాలా..?

**ఇప్పటికే నిస్సిగ్గుగా ఉన్నారు.. ఇంకా చొక్కాలు విప్పడమెందుకో?**

**ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ కార్యకర్తల తీరుపై మీరట్ సభలో మోదీ ధ్వజం**




దేశ రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఇండియా కృత్రిమ మేధ (ఏఐ) ఇంపాక్ట్ సదస్సు విజయవంతం కావడం కాంగ్రెస్ సహించలేకపోతోందని ప్రధాని మోదీ అన్నారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు ఆ సదస్సు వద్ద చొక్కాలు విప్పి హల్‌చల్ చేయడంపై మండిపడ్డారు. కాంగ్రెస్ మురికి, నగ్న రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఆ పార్టీ నిస్సిగ్గుగా మారిందని.. ఇంకా చొక్కాలు విప్పాల్సిన అవసరం ఏముందని ఎద్దేవాచేశారు.

## కృత్రిమ మేధ వినియోగంలో ఏఐ సదస్సు టర్నింగ్ పాయింట్

4

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
# రాంచందర్‌రావు అరెస్టు
ఇంటి వద్దే ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు..

- ఈటల, ఏలేటి గృహ నిర్బంధం
- కాంగ్రెస్, మజ్లిస్‌పై రాంచందర్‌రావు ఆగ్రహం
- అసద్ చెప్పుచేతల్లో సర్కారు ఉందని విమర్శ
- బాన్సువాడలో హిందువుల ఇళ్లపై రాళ్ల దాడులు అత్యంత అమానుషమని వ్యాఖ్య
- అవినీతిపై చర్చకు సిద్ధమని కాటిపల్లి సవాల్
- కామారెడ్డిలో కొనసాగుతున్న ఉద్రిక్తత



సీఎం రేవంత్ ప్రతి అడుగు వెనుక
# భూకబ్జాలే..

- మూసీ బాధితులకు అండగా ఉంటాం..
- మూసీ శుద్ధి పేరుతో పేదల ఇళ్లు కూలుస్తారా?: హరీశ్
- కాంగ్రెస్ సర్కారుకు ప్రజలే బుద్ధి చెప్తారు: కొండా
- మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులతో బీఆర్ఎస్, బీజేపీ నేతల వేర్వేరు భేటీలు

వివరాలు 3లో..



సీఐఎస్ఎఫ్ 'వందేమాతరం' తీరప్రాంత
# సైక్లోథాన్--2026 భేష్
**6,553 కిలోమీటర్ల జాతీయ సైకిల్ యాత్ర విజయవంతం**

**తీర వారసత్వం--రక్షణ బాధ్యతను పునరుద్ఘాటించిన సైక్లోథాన్**




07

# కుమ్మెర మల్లన్న జాతరలో 2 నెలల చిన్నారి దుర్మరణం

**కులం పేరుతో బాధిత కుటుంబానికి దర్శన నిరాకరణ**

**కుల వివక్ష ప్రదర్శించారని ఆరోపణలు**

**పసికందు మృతిపై ఎన్‌హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు**

**చిన్నారి మృతితో శని, ఆదివారాల్లో తీవ్ర ఉద్రిక్తత**

**బీఆర్ఎస్, బీఎస్పీ, సీపీఎం, బీసీ సంఘాల ఆందోళన**

**హైదరాబాద్ :** జిల్లా కేంద్రమైన నాగర్ కర్నూల్ మండలంలోని కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన చిన్న గొడవ.. చిలికి చిలికి గాలివానగా మారినట్లు ఓ పసికందు మృతికి కారణమైంది.. ఈ నెల 19న జరిగిన ఈ జాతరలో నెలకొన్న రద్దీలో భక్తులకు, నిర్వాహకులకు మధ్య జరిగిన తోపులాటలో నిరుపేద రజకుడు చిల్కేశ్వరం గణేశ్‌ను ఆయన భార్య పక్కకు తీసుకెళ్తుండగా, వారి 2 నెలల కూతురు కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడింది. నిర్వాహకులు కాలితో తన్నడం వల్లే గాయపడిందని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. తీవ్రంగా గాయపడిన చిన్నారి.. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందడంతో కుమ్మెర గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జాతరలో కుల వివక్ష జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అగ్ర కులాల జాతర నిర్వాహకులు చిన్నారి తల్లిదండ్రులను కులం ఆధారంగా ఆలయ ప్రవేశానికి నిరాకరించారని, దీనిపైనే వాగ్వాదం జరిగిందని బాధితులు చెప్పారు. ఈ సందర్భంగా వారిపై దాడి చేయడంతో జరిగిన తొక్కిసలాటలో చిన్నారి కింద పడటంతో గాయపడిందని వాపోయారు. జాతర నిర్వాహకులు కాలితో తన్నడం వల్లే తమ కూతురు చనిపోయిందని వారు ఆరోపించారు. నిర్వాహకుల దాడి వల్లే తమ చిన్నారి చనిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు గణేశ్, మౌనిక తమకు న్యాయం చేయాలని కోరారు. మరోవైపు ఈ ఘటనపై మానవ హక్కుల న్యాయవాది ఇమ్మనేని రామారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్‌సీ) విచారణకు ఆదేశించింది. సంబంధిత అధికారుల నుంచి సమగ్ర నివేదిక కోరినట్లు సమాచారం. చిన్నారి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆస్పత్రికి తరలించినప్పుడూ ఉద్రిక్తత నెలకొంది. దళితులు, బీసీ సంఘాలు, బీఆర్ఎస్, బీఎస్పీ, సీపీఎం ఆధ్వర్యంలో అర్ధరాత్రి వరకూ ఆందోళన కొనసాగింది. బాధితులతో ఫోన్‌లో మాట్లాడిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. చిన్నారి మృతి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ ఎస్పీకి కవిత ఫోన్ చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు బాధిత కుటుంబంతో కలిసి నాగర్ కర్నూల్ డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన రెడ్డి మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేసినా నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న రాజ్యాధికార పార్టీ నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ చిన్నారి మృతి కారకులపై హత్య కేసు నమోదు చేయాలని డీఎస్పీని డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఎందుకు పెండింగ్‌లో పెట్టారని ప్రశ్నించారు. అటుపై పోలీస్ స్టేషన్ వద్ద రాస్తారోకో చేసి కుమ్మెర గ్రామానికి వెళ్లారు.

# పెళ్లి నాడే అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

**జోధ్‌పూర్, ఫిబ్రవరి 22:** మరికొద్ది గంటల్లో పెళ్లి కుమార్తెలుగా కల్యాణవేదికపై కూర్చోవాల్సిన అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకోవడం రాజస్థాన్‌లో కలకలం కలిగించింది. జోధ్‌పూర్ జిల్లా మనాయ్ గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు శోభ (25), విమల (23)లకు శనివారం వివాహం చేయడానికి అన్ని సన్నాహాలు జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు కుటుంబ సభ్యులు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. వారిద్దరు కూడా అప్పటివరకు అక్కడే ఉన్నారు. అనంతరం గదిలోకి వెళ్లి నిద్రపోయారు. వేకువజాము నాలుగు గంటలకు చూడగా వారి ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణిస్తున్నట్టు కనిపించింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే వారు మరణించారు. పోస్టుమార్టం రిపోర్టులో విషం తాగినట్టు తేలింది. ఆత్మహత్యకుగల కారణాలు తెలియరాలేదు.

# నేనూ రైతు బిడ్డనే.. సేద్యం తర్వాతే ప్రజాసేవ

**వ్యవసాయంలో పెనుమార్పులకు సర్కారు చర్యలు**

**రైతుబడి అగ్రిషోలో రాష్ట్ర వ్యవసాయమంత్రి తుమ్మల**



**హైదరాబాద్ :** వ్యవసాయ రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని యువత కూడా ఐటీ రంగాన్ని వదిలి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో మూడు రోజులుగా కొనసాగుతున్న రైతు బడి అగ్రిషోను మంత్రి తుమ్మల ఆదివారం ముఖ్య అతిథిగా సందర్శించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను స్వయంగా పరిశీలించి.. సాంకేతికత, అధునాతన పరికరాలతో ఎలా లాభసాటి వ్యవసాయం సాధ్యమవుతుందనే విషయాలను స్టాళ్ల యజమానులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ తానూ రైతు బిడ్డనేనని గుర్తు చేశారు. ఎన్టీఆర్ స్టేడియంలోకి భారీ సంఖ్యలో రైతులను ఏకతాటిపైకి తీసుకొచ్చిన రైతుబడి అగ్రి షో నిర్వాహకులను మంత్రి తుమ్మల అభినందించారు. 3 రోజులు జరిగిన అగ్రిషోకు వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా రైతులు తరలి వచ్చారు.

# రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం

**కాళేశ్వరాన్ని గాలికి వదిలేయం**

**అది ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్టు.. వినియోగంలోకి తెస్తాం**

**గత సర్కారు కాళేశ్వరానికే రూ.1.02 లక్షల కోట్లు ఖర్చు చేసింది**

**మిగతా ప్రాజెక్టుల్ని నిర్లక్ష్యం చేయడంతో భూసేకరణకు ఇబ్బందులు**

**6వేల కోట్లతో మొదలెట్టిన దేవాదుల 18,500 కోట్లకు చేరింది**

**గోదావరి జలాల వివాదం రాజకీయ రంగు పులుముకుంది**

**పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే ఈ వివాదం వచ్చేదికాదు**

**కృష్ణా జలాలపై మేము ఏపీకి సహకరిస్తున్నామనేది పచ్చి అబద్ధం**

**బీఆర్ఎస్ నేతలూ శాసనసభకు రండి.. అన్ని అంశాలపై చర్చిద్దాం**

**2027 డిసెంబరు నాటికి దేవాదుల నిర్మాణం పూర్తి కావాలి**

**దేవాదులపై సమీక్ష.. మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి**



**వరంగల్, ఫిబ్రవరి 22 :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుకే రూ. 1.02 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. నిధులన్నీ ఆ ఒక్క ప్రాజెక్టుకే ఖర్చు చేసి, మిగతా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో ప్రస్తుతం భూసేకరణకు నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును గాలికి వదిలేయబోమని, అది ప్రజల సొమ్ముతో నిర్మించినదని అన్నారు. దానిని వినియోగంలోకి తెస్తామని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ పైన కుంగిందని, లోపలి భాగంలో ఏం జరిగిందో అంచనా వేయటానికి సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. ఏ బ్యారేజీని వృథాగా ఉంచబోమన్నారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి.. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్టును మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కతో కలిసి సందర్శించారు. నేరుగా దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్దకు వెళ్లి.. గోదావరి జలాల ప్రవాహాన్ని పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల వివాదం రాజకీయ రంగు పులుముకుందని, గత పదేళ్ల పాలనలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఈ వివాదమే ఉండేది కాదన్నారు. రాష్ట్రంపై రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉండడంతో.. సాగునీటి ప్రాజెక్టులు 70–80 శాతం పూర్తయినా పెండింగ్ పనులు పూర్తి చేసుకునేందుకు నిధుల కొరత ఉందని చెప్పారు. అయినా.. ఆర్థిక పరిస్థితులను అధిగమించి రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. 2001లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రూ. 6 వేల కోట్లతో చేపట్టిన దేవాదుల ప్రాజెక్టుకు ఇప్పటికి రూ. 14,500 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. అయినా.. ఈ అంచనాలను రూ. 18,500 కోట్లకు పెంచాల్సిందిగా అధికారులు సూచిస్తున్నారని, ఇక్కడితోనైనా దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాలని నిర్ణయించామన్నారు.

### కాళేశ్వరాన్ని మహాద్భుతం అన్నారు..

కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం మహాద్భుతంగా చూపించిందని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఆ ప్రాజెక్టు నుంచి చుక్కనీరు కూడా ఎత్తిపోయకపోయినా దేశంలో అత్యధికంగా వరిసాగు చేసిన రాష్ట్రంగా తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను, పంపుహౌసులను ఏ ఉద్దేశంతో కట్టారో.. ఆ నీళ్లు, నిధులు ఎక్కడికి పోయాయో తాను విమర్శ చేయదలుచుకోలేదన్నారు. అయితే గోదావరి జలాలే కాకుండా కృష్ణా జలాలపైనా అనేక అపోహలు కల్పిస్తున్నారని విమర్శించారు. పక్క రాష్ట్రానికి నీటిని తరలించడానికి తాము సహకరిస్తున్నామంటున్నారని తప్పుబట్టారు. "కృష్ణా జలాలపై పూర్తి స్థాయి చర్చ శాసనసభలోనే చేపట్టాం. బహిరంగ సభలు పెట్టి ఊకదంపుడు ఉపన్యాసాలివ్వడం వద్దు. ఉమ్మడి రాష్ట్రంలో ఏం జరిగింది? తెలంగాణ వచ్చిన తరువాత కేసీఆర్ హయాంలో హరీశ్‌రావు సాగునీటి మంత్రిగా ఉన్నప్పుడు ఏం జరిగింది? రెండేళ్లుగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఏం జరిగిందో చర్చించేందుకు అసెంబ్లీకి ఆహ్వానిస్తున్నాం. కృష్ణా జలాలకు సంబంధించిన అంశాలపై మొన్నటి శాసనసభలో వివరణ ఇచ్చాం. అయినా మీ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి మాపై ఆరోపణలు చేయడం సబబు కాదు. మీరు తప్పు చేశారా? లేదా? అన్నది ప్రజలు గుర్తించారు.. శిక్షించారు" అని రేవంత్ అన్నారు.

### అసెంబ్లీలోనే చర్చ చేద్దాం..

"గోదావరి జలాలపై శాసనసభలో కూర్చుని చర్చ చేద్దాం. మేం ఏదైనా సవరించుకోవాల్సి ఉంటే అందుకు ఎలాంటి అభ్యంతరం లేదు. పక్క రాష్ట్రానికి నీళ్లు తీసుకెళ్లడానికి మా ప్రభుత్వమే సహకరిస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రజా జీవితంలో ఉండి తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన వారు.. ఎవరైనా ఆ పని చేస్తారా? ఏపీ నుంచి వలస వచ్చి ఇక్కడ సెటిలైన వ్యక్తులైనా సహకరిస్తారా? ఇలాంటి చౌకబారు ఆరోపణలతో ప్రయోజనం ఉండదు" అని రేవంత్ అన్నారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడి.. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి పౌరుడికి తాగునీరు అందించటమే లక్ష్యమని ప్రకటించారు. మేడారం జాతరను దక్షిణాది కుంభమేళాగా నిర్వహించుకున్నామని, చిన్నచిన్న సమస్యలున్నా సరి చేసుకున్నామని తెలిపారు. భక్తులు నిరంతరం దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని, బడ్జెట్ సమావేశాల తరువాత మేడారం వస్తానని అన్నారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి ఉపయోగపడే మంచి పుస్తకాలు చదవాలని, చిన జీయర్‌స్వామి సూక్తులు, మంచి ప్రవచనాలు వినాలని సీఎం రేవంత్ సూచించారు. అంతే తప్ప ప్రజలపై విషం కక్కవద్దన్నారు. తమ వారసత్వ ఆస్తిని ఎవరో కొల్లగొట్టారన్నట్లుగా కడుపులో బాధ పెట్టుకుంటే ఆరోగ్యం దెబ్బతింటుందని వ్యాఖ్యానించారు.

### దేవాదుల ప్రాజెక్టుకు రూ.600 కోట్లు..

దేవాదుల ప్రాజెక్టుకు భూసేకరణ కోసం జూన్ 2లోపు రూ. 600 కోట్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం ఈ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. సమ్మక్క బ్యారేజీ ఎంత దూరంలో ఉందని, అక్కడ నిల్వ చేస్తే ఇక్కడి వరకు ఎన్ని టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులను అడిగారు. రూ. 2,121 కోట్లతో బ్యారేజీ పూర్తి చేశామని, 6.94 టీఎంసీల నీరు బ్యారేజీలో నిల్వ ఉంటుందని, 300 రోజులు 60 టీఎంసీల వరకు నీటిని లిఫ్టు చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు రూ. 14,500 కోట్ల వరకు ఖర్చు చేశామని, ఇంకో రూ. 4వేల కోట్ల వరకు నిధులు ఇస్తే, భూసేకరణతో పాటు ఇతర నిర్మాణాలు పూర్తవుతాయని వివరించారు. దీంతో వెంటనే ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కావాల్సిన అంచనాలతో రిపోర్టు ఇవ్వాలని, 2027 డిసెంబరు నాటికి నిర్మాణం పూర్తి చేయాలని సీఎం అన్నారు. మార్చిలో ప్రత్యేక మంత్రివర్గ సమావేశం నిర్వహించి అన్ని అంచనాలకు ఆమోదం తెలుపుతామన్నారు. దేవాదుల పంపుల మరమ్మతులను ను నెలరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి దేవాదులపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల భర్తీసకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని, పరిహారం చెల్లింపులను గ్రీన్ చానల్ ద్వారా వేగంగా మంజూరు చేస్తామని చెప్పారు. రామప్ప చెరువు నుంచి జంపన్న వాగుకు నీరందించే ప్రణాళికపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు మహబూబాబాద్ జిల్లా రెడ్యాలలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నేత వెన్నం రాఘవేంద్రరెడ్డి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు.

### సీఎం రేవంత్‌కు హార్వర్డ్ ఆహ్వానం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అమెరికాలోని హార్వర్డ్ కెనెడీ స్కూల్ నుంచి అరుదైన ఆహ్వానం అందింది. ఆ సంస్థ తొలిసారిగా నిర్వహిస్తున్న ఏఐ పాలసీ సింపోజియంకు హాజరై ప్రసంగించాల్సిందిగా సీఎంను ఆహ్వానించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మార్చి 27న హార్వర్డ్ స్కూల్ క్యాంప్‌సలో జరగనున్న ఈ కార్యక్రమానికి భారత్ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి ఒక్కరే ఈ ఆహ్వానాన్ని అందుకోవడం విశేషం. ఈ సదస్సులో 'ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కంప్యూటర్ పవర్: ఇంపాక్ట్ ఆన్ లివబిలిటి అండ్ వర్క్‌ఫోర్స్' అనే ప్యానెల్‌లో ప్రసంగించాలంటూ రేవంత్‌ను ఆహ్వానించారు. ఈ సెషన్‌లో డేటా సెంటర్లు, ఎనర్జీ సిస్టమ్స్, కంప్యూట్ కారిడార్స్ ప్రభావంపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఏఐ ఎకో సిస్టమ్ అభివృద్ధి, ఏఐ సిటీ అభివృద్ధి లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, భూమి, విద్యుత్, నైపుణ్యాలు, నియంత్రణ, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రసంగించేందుకు సీఎంను ప్రత్యేకంగా ఆహ్వానించారని అధికారులు తెలిపారు. ఇటీవల రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో నిర్వాహకులు ఆయనను ప్రత్యేకంగా కలిసి సింపోజియంపై చర్చించారు. ప్రభుత్వం, పరిశ్రమ, అకాడమీ రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ఏఐ పాలన, జియో పాలిటిక్స్, నాలెడ్జ్ ఎకానమీ, ఎనేబ్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాలపై చర్చించేందుకు ఈ సింపోజియం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

# ప్రజలతో మమేకమవ్వాలి

**డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరంలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**




**వికారాబాద్, ఫిబ్రవరి 22 :** ప్రజలతో మమేకమై కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతానికి కృషి చేయాలని డీసీసీ అధ్యక్షులకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలోని హరిత రిసార్ట్స్‌లో ఏఐసీసీ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రత్యేక శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలతో సన్నిహితంగా ఉంటూ జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. సమన్వయం, క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేస్తే కాంగ్రెస్ పార్టీకి మరింత ప్రజాదరణ లభిస్తుందని తెలిపారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం, ఉద్యమ నేపథ్యం, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకత, ఆశయాలు, అమరుల త్యాగాలు, లక్ష్యాలు తదితర అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర పోరాటానికి దారితీసిన పోరాట గాథను స్మరించుకుంటూ.. ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యతను వివరించారు. అంతకు ముందు మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు.. కాంగ్రెస్ చరిత్ర, ఛరఖా గురించి అవగాహన కల్పించారు. సంఘటన్ సృజన్ అభియాన్ చైర్మన్ సచిన్‌రావు ఆధ్వర్యంలో, ఆర్గనైజింగ్ సెక్రటరీ వంశీచందర్‌రెడ్డి, చైర్మన్ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో శిబిరం కొనసాగుతోంది. కాగా, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ శిక్షణా శిబిరంలో ఆదివారం ఛరఖా తిప్పి నూలు వడికారు. డీసీసీ అధ్యక్షులు కూడా చరఖా తిప్పుతూ నూలు వడికారు. అంతకు ముందుకు ఛరఖా ప్రాముఖ్యత గురించి వివరించిన శిక్షకులు నూలు వడికే విధానంపై అవగాహన కల్పించారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
సోమవారం 23 ఫిబ్రవరి 2026


# సీఐఎస్ఎఫ్ 'వందేమాతరం' తీరప్రాంత సైక్లోథాన్-2026 భేష్

**6,553 కిలోమీటర్ల జాతీయ సైకిల్ యాత్ర విజయవంతం**

**తీర వారసత్వం--రక్షణ బాధ్యతను పునరుద్ఘాటించిన సైక్లోథాన్**







**కొచ్చి (కేరళ):** సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "వందేమాతరం తీరప్రాంత సైక్లోథాన్--2026" జాతీయ సైకిల్ యాత్ర దేశ ఐక్యత, తీరప్రాంత భద్రత, వారసత్వ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, 6,553 కిలోమీటర్ల మేర సాగిన ఈ సుదీర్ఘ సైకిల్ యాత్ర అత్యంత క్లిష్టమైనదైనా, సీఐఎస్ఎఫ్ బృందాలు దానిని విజయవంతంగా పూర్తి చేయడం ప్రశంసనీయమన్నారు. పాదయాత్ర లేదా వాహన ప్రయాణం కొంతవరకు సులభమై ఉండవచ్చని, అయితే వేల కిలోమీటర్ల మేర సైకిల్‌పై ప్రయాణించడం అపారమైన శ్రమ, సహనం, ధైర్యం అవసరమని ఆయన అన్నారు. తూర్పు తీరప్రాంతం నుంచి ఒక బృందం, పడమటి తీరప్రాంతం నుంచి మరొక బృందం ప్రయాణం ప్రారంభించి దేశ తీరప్రాంతాల గుండా ప్రయాణించి చివరకు కొచ్చిలో కలవడం దేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచిందన్నారు. భారత తీరప్రాంతం వేల ఏళ్లుగా నాగరికత, వాణిజ్యం, సాంస్కృతిక పరస్పర మార్పిడికి కేంద్రబిందువుగా నిలిచిందని, గుజరాత్ ప్రాచీన నౌకాశ్రయాల నుంచి గోవా తీరాలు, కేరళ మత్స్యకార గ్రామాలు, సుందర్‌బన్ మడ అడవుల వరకు విస్తరించిన సముద్ర వారసత్వాన్ని ఈ సైక్లోథాన్ మరోసారి గుర్తుచేసిందన్నారు. తీరప్రాంతాల పరిరక్షణ, భద్రత బాధ్యతను ప్రజలకు చేరవేసే ప్రయత్నంగా ఈ యాత్ర నిలిచిందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ గ్రామ సశక్తీకరణ దృష్టికోణానికి అనుగుణంగా ఈ సైక్లోథాన్‌లో భాగంగా 52 తీరప్రాంత గ్రామాలను దత్తత తీసుకోవడం అభినందనీయమన్నారు. తీర భద్రత కేవలం భద్రతా దళాల బాధ్యత మాత్రమే కాకుండా అప్రమత్తమైన పౌరుల సహకారంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ నౌకాయాన, నౌకాశ్రయ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సీఐఎస్ఎఫ్‌కు అప్పగించిన బాధ్యతలను ఈ యాత్ర మరింత బలపరిచిందన్నారు. మహిళా సాధికారతకు ఈ సైక్లోథాన్ నిదర్శనమని కేంద్ర మంత్రి తెలిపారు. మొత్తం 130 మంది సైకిల్ యాత్రికుల్లో 65 మంది మహిళలే ఉండటం విశేషమని, 6,553 కిలోమీటర్ల ఈ దుర్భర ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా మహిళలు ఏ రంగంలోనైనా ధైర్యంగా నిలబడగలరని నిరూపించారన్నారు. ఈ ముగింపు కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్, అదనపు డైరెక్టర్ జనరల్స్ పద్మాకర్ ఎస్. రణపిసే, సుధీర్ కుమార్, విజయ్ ప్రకాశ్, ఐజీలు ఎస్.ఆర్. సర్వానన్, జోస్ మోహన్ తదితర ఉన్నతాధికారులతో పాటు మళయాళ నటుడు జయసూర్య, అర్జున పురస్కార గ్రహీత ఐ.ఎం. విజయన్, బ్యాడ్మింటన్ శిక్షకుడు జోయ్ టీ. ఆంటోనీ, నటి ప్రయాగ మార్టిన్ తదితరులు పాల్గొన్నారు. దేశ తీరప్రాంత గౌరవాన్ని పెంచుతూ, ప్రజలతో భద్రతా దళాల అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే ఈ "వందేమాతరం తీరప్రాంత సైక్లోథాన్" శాశ్వత సంప్రదాయంగా కొనసాగాలని కేంద్ర మంత్రి ఆకాంక్షించారు.

# ఏఐసీసీకి ఏటీఎంలా తెలంగాణ

**రేవంత్ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టిన సీఎం**

**హామీల అమలుకు నిధుల్లేవని కుంటిసాకులు**

**3 లక్షల కోట్లు అప్పుతెచ్చి.. ఒక్క ఇటుకైనా పేర్చావా?**

**ఎక్స్ ద్వారా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 22 :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎంలా మార్చారని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రెండేండ్లుగా తాము అనేకసార్లు ఈ విషయంపై హెచ్చరించామని, ఇప్పుడు రేవంత్‌రెడ్డే నిస్సిగ్గుగా ఒప్పుకున్నారని ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర సంపదను కాం గ్రెస్ అధిష్ఠానానికి ధారపోస్తూ, తెలంగా ణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుత పాలనను దండుపాళ్యం ముఠా తీరుతో పోల్చిన కేటీఆర్.. తెలంగాణను దోచుకోవడం, సొంతానికి దాచుకోవడం.. తన పదవిని కాపాడుకోవడం కోసం ఢిల్లీకి సంచులు మోయడమే సీఎం రేవంత్‌ఏకై క అజెండా అని ధ్వజమెత్తారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలుతోపాటు అభివృద్ధి పనులకూ ప్రభుత్వం వద్ద రూ పాయి నిధుల్లేవంటూ సాకులు చెప్తున్నారని విమర్శించారు. ఈ రెండేండ్ల కాలంలోనే కాంగ్రెస్ సర్కార్ రూ.3 లక్షల కోట్ల మేరకు భారీగా అప్పులు తెచ్చిందని తెలిపారు. కానీ, రాష్ట్రంలో ప్రభుత్వం అభివృద్ధి కోసం కనీసం ఒక ఇటుక కూడా పేర్చిన దాఖలాలు లేవని విమర్శించారు. ప్రజల సొమ్మును ప్రజా ప్రయోజనాలకు వాడకుండా పకదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు.

**పేదల ఇండ్లు, భూములు వదలడం లేదు**

రాష్ట్రంలో సాగుతున్న భూ దోపిడీపైనా కేటీఆర్ స్పందించారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇండ్లను, లగచర్ల సహా పలుచోట్ల గిరిజనుల భూములను, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములనూ రేవంత్ సర్కార్ వదలడం లేదని మండిపడ్డారు. హిల్ట్ పాలసీ పేరిట పరిశ్రమల భూములను అనుముల బ్రదర్స్ కలిసి అంబుక పడుతున్నారని, ఒక పద్ధతి ప్రకారం రాష్ట్ర వనరులను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల కష్టార్జితాన్ని దారిమళ్లిస్తూ రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ కోరారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అరెస్టు

**ఇంటి వద్దే ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు..**

**ఈటల, ఏలేటి గృహ నిర్బంధం**

**కాంగ్రెస్, మజ్లిస్‌పై రాంచందర్‌రావు ఆగ్రహం**

**అసద్ చెప్పుచేతల్లో సర్కారు ఉందని విమర్శ**

**బాన్సువాడలో హిందువుల ఇళ్లపై రాళ్ల దాడులు అత్యంత అమానుషమని వ్యాఖ్య**

**అవినీతిపై చర్చకు సిద్ధమని కాటిపల్లి సవాల్**

**కామారెడ్డిలో కొనసాగుతున్న ఉద్రిక్తత**



హైదరాబాద్ : కామారెడ్డిలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఘర్షణ వాతావరణం.. బాన్సువాడలో రెండు వర్గాల మధ్య హింసాత్మక ఘటనలు చెలరేగిన నేపథ్యంలో ఆదివారం చలో కామారెడ్డి, బాన్సువాడకు బీజేపీ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు యత్నించిన పలువురు పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. మరి కొందరిని గృహ నిర్బంధం చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డితో పాటు బాన్సువాడలో పలు కుటుంబాలను పరామర్శించేందుకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును తార్నాకలోని నివాసం వద్ద పోలీసులు అరెస్టు చేసి బొల్లారం ఠాణాకు తరలించారు. దీంతో ఆయన్ను విడుదల చేయాలని బీజేపీ కార్యకర్తలు పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేశారు. మరోవైపు, కామారెడ్డికి బయలుదేరిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్యలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీధర్ గౌడ్ పోలీసుల కన్నుగప్పి కామారెడ్డికి రావడంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. బాన్సువాడ వెళుతున్న మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ను మార్గమధ్యలోనే పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బొల్లారం పోలీసు స్టేషన్‌లో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ చెప్పుచేతల్లో సర్కారు కొనసాగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం చేతిలో బందీగా మారిందని విమర్శించారు. పోలీసులు తనను అక్రమంగా అరెస్టు చేయడం, ముందస్తుగా గృహ నిర్బంధం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బాన్సువాడలో హిందువుల ఇళ్లపై జరిగిన రాళ్ల దాడి అత్యంత అమానుషమని అన్నారు. బాన్సువాడలో ఒక్క ఎంఐఎం కార్యకర్తను కూడా అరెస్టు చేయని పోలీసులు80మంది బీజేపీ, హిందూ సంఘాల కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. హిందూ సంఘాలపై, తమ పార్టీ కార్యకర్తలపై నమోదు చేసిన తప్పుడు కేసులను సహించబోమని తేల్చిచెప్పారు. తాను బాన్సువాడ వెళ్లి తీరతానని, బాధితులను పరామర్శిస్తానని చెప్పారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నిష్పక్షపాతంగా, నిబద్ధతతో పనిచేయాలి తప్ప, కాంగ్రెస్ నేతల చేతుల్లో తోలుబొమ్మలా వ్యవహరించవద్దని సూచించారు. కాగా, రాంచందర్‌రావు అరెస్టును నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు తార్నాక చౌరాస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

**అక్రమాలను ప్రశ్నిస్తే దాడులా?: సంజయ్**

కాంగ్రెస్ అక్రమాలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట్రంలో రౌడీరాజ్యం నడుస్తోందా..?అని నిలదీశారు. కామారెడ్డిలో అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్సే అని స్పష్టం చేశారు. బాన్సువాడలో రాళ్లదాడికి పాల్పడిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎంఐఎం, కాంగ్రెస్ కలిసి అరాచకాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. బాన్సువాడ బయలుదేరిన రాంచందర్‌రావును అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. పార్టీ హైకమాండ్‌కు కప్పం చెల్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. అప్పు మొత్తాన్ని కాంట్రాక్టర్లకు చెల్లించి, వారిచ్చే కమీషన్లను హైకమాండ్‌కు పంపించేందుకు మంత్రులు సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తనతో పాటు పార్టీ ముఖ్య నాయకులను రెండు రోజులుగా హౌస్ అరెస్టు చేయడం రేవంత్ సర్కార్ నిర్బంధకాండకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం ఆరంభమైందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రేవంత్ సీఎం అయ్యాక హిందువులపై దాడులు పెరిగిపోయాయని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. తమ పార్టీ నాయకులను నిర్బంధించడం, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. బాన్సువాడ ఘటనపై డీజీపీ విచారణ జరపాలని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ విజ్ఞప్తి చేశారు.

**కామారెడ్డిలో చల్లారని వేడి..**

కామారెడ్డిలో కాంగ్రెస్, బీజేపీ మధ్య వివాదం సద్దుమణగలేదు. బాన్సువాడలో హింసాత్మక ఘటనలు, అదేవిధంగా శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఇంటి ముట్టడిని నిరసిస్తూ ఆదివారం చలో కామారెడ్డి, బాన్సువాడకు బీజేపీ పిలుపునిచ్చింది. దీంతో ఆ రెండు పట్టణాల్లో హై అలర్ట్ కొనసాగింది. కామారెడ్డిలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఇంటి వద్ద, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా తనపై చేసిన అవినీతి ఆరోపణలను సోమవారం కలెక్టరేట్‌లో అధికారుల సమక్షంలో ఆధారాలతో నిరూపించాలని కాంగ్రెస్ నేతలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరించిన కాంగ్రెస్ నేతలు ఆయన అవినీతి, అక్రమాలపై ఆధారాలతో వస్తామని ప్రకటించారు. దీంతో సోమవారం మళ్లీ ఏం జరుగుతుందోనని టెన్షన్ నెలకొంది.

# సీఎం రేవంత్ ప్రతి అడుగు వెనుక భూకబ్జాలే..

**మూసీ బాధితులకు అండగా ఉంటాం..**

**మూసీ శుద్ధి పేరుతో పేదల ఇళ్లు కూలుస్తారా?: హరీశ్**

**కాంగ్రెస్ సర్కారుకు ప్రజలే బుద్ధి చెప్తారు: కొండా**

**మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులతో బీఆర్ఎస్, బీజేపీ నేతల వేర్వేరు భేటీలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 22 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేసే ప్రతి అడుగు వెనుక భూముల కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉంటుందని మాజీ మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లు కూల్చి బడా కాంట్రాక్టర్లకు భూములు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోతున్న గండిపేట మండలం హైదర్షాకోట్, బండ్లగూడ బాధితులను ఆదివారం కలిసి మాట్లాడారు. ఆయనతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ కార్తీక్‌రెడ్డి ఉన్నారు. మధుపార్క్ రిడ్జ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ.. మూసీ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని.. వారి పక్షాన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. ఆనాడు కేసీఆర్ మంచి నీళ్లు ఇచ్చి బతుకులను నిలబెడితే, రేవంత్ బుల్డోజర్లు పెట్టి వారి జీవితాలను కూలగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధుపార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులు బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము మూసీ శుద్ధికి వ్యతిరేకం కాదని.. ప్రజల కోసం, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసమే మాట్లాడుతున్నామని చెప్పారు. 'చదువుకునే పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్, రైతులకు రైతు బంధు అడిగితే డబ్బుల్లేవని సీఎం అనడం విడ్డూరంగా ఉంది. పైసలు లేకపోతే మెస్సీతో ఫుట్‌బాల్ మ్యాచ్, మిస్ వరల్డ్ పోటీలకు వందల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి..? బడా కాంట్రాక్టర్లకు రూ.20 వేల కోట్లు బిల్లులు ఇచ్చారు. ఇప్పుడు ఎవరి జేబులు నింపడానికి మూసీ ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారు?' అని నిలదీశారు. మూసీ బాధితులను బీజేపీ నేతలు కూడా పరామర్శించారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివ్షసరెడ్డితో కలిసి హైదర్షాకోట్, బండ్లగూడ బాధితులతో మాట్లాడారు. అనంతరం మధురిడ్జ్ పార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో కొండా మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న వ్యతిరేక నిర్ణయాన్ని ఖండిస్తున్నామని.. మధుపార్క్ అపార్ట్‌మెంట్ వాసులకు అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. మూసీ సుందరీకరణ అంటూ ప్రజలను బలి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. బీజేపీది ఎప్పుడూ ప్రజల పక్షమేనని.. ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని చెప్పారు.

**గత సర్కారు కమీషన్ల కక్కుర్తి వల్లే.: చామల**

మధు పార్క్ అపార్ట్‌మెంట్ వాసులను హరీశ్ పక్కదోవ పట్టిస్తున్నారని, వాస్తవానికి గత ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తి వల్లనే వారు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 2012లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం కాకుండా మధు పార్క్ బిల్డర్లు బఫర్ జోన్‌లోనే అపార్ట్‌మెంట్ కట్టారని.. 30 మీటర్ల బఫర్ ఉండాల్సిన చోట 9 మీటర్ల బఫర్ చూపించి అనుమతి తీసుకున్నారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్కారు ఆ బిల్డర్లపై కేసు పెట్టి వారితోనే అపార్ట్‌మెంట్ వాసులకు నష్టపరిహారం ఇప్పిస్తుందని హామీనిచ్చారు. హరీశ్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా హైదరాబాద్ అభివృద్ధిని ఆపలేరని.. చిల్లర రాజకీయాలు మానుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. మూసీ నిర్వాసితులపై కపట ప్రేమ చూపిస్తున్న హరీశ్.. బీఆర్ఎస్ హయాంలో మల్లన్నసాగర్ నిర్వాసితుల బాధలు ఎందుకు పట్టించుకోలేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నిలదీశారు. ఆనాడు 14 గ్రామాల ప్రజలు ఆందోళన చేసినా.. కొందరు చనిపోయినా కనికరించని హరీశ్.. ఇవ్వాళ కన్నీరు కారుస్తున్నట్లు నటిస్తున్నారని విమర్శించారు. పదేళ్ల పాటు మూసీ అభివృద్ధి పేరుతో కార్పొరేషన్ పెట్టి రూ.వేలకోట్లు దండుకున్నది బీఆర్ఎస్ పెద్దలు కాదా అని ప్రశ్నించారు. మూసీని అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పి తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

# భారీ ఉగ్ర కుట్ర భగ్నం!

## తమిళనాడు, బెంగాల్లో 8 మంది అరెస్టు



**న్యూఢిల్లీ :** దేశంలో భారీ ఉగ్ర కుట్రను పోలీసులు భగ్నం చేశారు. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేసే ఉగ్ర సంస్థల అండదండలతో ఢిల్లీలో విధ్వంసానికి ప్రణాళికలు రచించినట్లు అనుమానిస్తున్న 8మంది ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ లష్కరే తాయిబా పేలుళ్లకు కుట్ర పన్నిందన్న నిఘా వర్గాల సమాచారంతో భద్రతా సంస్థలు శనివారం అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. పక్కా సమాచారం, ఓ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు ఢిల్లీ పోలీసులు మేరకు తమిళనాడులోని పలు ప్రాంతాలు, పశ్చిమబెంగాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. శనివారం తమిళనాడులో ఆరుగురిని, అంతకముందు పశ్చిమబెంగాల్‌లో మరో ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ నిమిత్తం ఢిల్లీకి తరలించారు. పట్టుబడిన వారిలో ఏడుగురు బంగ్లాదేశీయులు కాగా, ఒకరు పశ్చిమబెంగాల్‌లోని మాల్దాకు చెందిన వ్యక్తి అని పోలీసులు తెలిపారు. వీరంతా భారతదేశంలోకి చొరబడి, నకిలీ ఆధార్ కార్డులు సంపాదించారని చెప్పారు. నిందితులంతా సోషల్ మీడియా ద్వారా ఒకరితో ఒకరు టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈ 8మందిలో నలుగురు వ్యక్తుల గ్రూపు దేశ రాజధానిలో ఏఐ సదస్సు జరుగుతున్న సమయంలో ఢిల్లీ, కోల్‌కతాలకు వెళ్లి.. పలు చోట్ల 'ఫ్రీ కశ్మీర్', ఉగ్రవాది బుర్హాన్ ఫొటోలు ఉన్న పాకిస్థాన్, ఉగ్రవాద అనుకూల పోస్టర్లను అంటించి, తిరిగి తమిళనాడు, పశ్చిమబెంగాల్‌కు వెళ్లిపోయారని అధికారులు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి లష్కరే తాయిబా ఉగ్రవాది షబ్బీర్ అహ్మద్ ఆదేశాలతో పోస్టర్లు అంటించారని, ఇతను కశ్మీర్‌కు చెందిన వ్యక్తి అని తెలిపారు.

# జమ్మూకశ్మీర్‌లో ముగ్గురు ఉగ్రవాదుల హతం



**శ్రీనగర్ :** జమ్మూకశ్మీర్‌లోని కిస్త్వాడ్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. వారు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ (జేఈఎం) తరఫున పనిచేస్తున్నారని భద్రతాబల గాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన మట్టి ఇంట్లో ఉగ్రవాదులు ఉన్నారన్న కచ్చితంగా సమాచారం అందుకున్న భద్రతాబలగాలు ఆపరేషన్ ట్రాషి-ఐ పేరుతో అత్యంత సాహసంతో గాలింపు చేపట్టాయి. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరపగా, జవాన్లు కూడా ఎదురుకాల్పులు జరిపి వారిని మట్టుబెట్టారు. మృతి చెందిన వారిలో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైఫుల్లా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

# ఇరాన్‌లో మళ్లీ విద్యార్థుల ఆందోళన

## నియంతకు మరణం అంటూ నినాదాలు

**టెహ్రాన్ :** ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు మరోసారి ఆందోళనకు దిగారు. గత నెలలో జరిగిన ఆందోళనను ప్రభుత్వం కఠినంగా అణచివేయడంతో సద్దుమణిగినట్టు కనిపించినా శనివారం మళ్లీ మతపాలకులకు నిరసన తెలుపుతూ వీధుల్లోకి వచ్చారు. టెహ్రాన్‌లోని షరీఫ్ ఇంజినీరింగ్ యూనివర్సిటీ విద్యార్థులు 'బి షరఫ్' (సిగ్గుచేటు) అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమెనెయ్‌ను 'హంతక నేత'గా అభివర్ణించారు. ప్రవాసంలో ఉన్న రాకుమారుడు రెజా పహ్లావీ రాజుగా బాధ్యతలు చేపట్టాలని డిమాండు చేశారు. టెహ్రాన్‌లోని బెహెస్తీ, అమిర్ కబీర్ విశ్వవిద్యాలయాల విద్యార్థులు కూడా ఆందోళనకు దిగారు. నిరసనలకు కేంద్రస్థానంగా ఉన్న అబ్దానన్ పట్టణంలో విద్యార్థులు 'నియంతకు మరణం' అంటూ నినాదాలు చేశారు. ఆందోళనలో పాల్గొన్న టీచరును అరెస్టు చేయడంతో సుప్రీంలీడర్‌కు వ్యతిరేకంగా ప్రదర్శన జరిపారు.

# మార్చి 31లోగా 500 చార్జిషీట్లు దాఖలు చేయాలి

## పెండింగ్ కేసులపై అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించిన ఈడీ

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మనీ లాండరింగ్ కేసుల్లో 500 చార్జిషీట్లు దాఖలు చేయాలని ఈడీ లక్ష్యంగా పెట్టుకుంది. కేసు రిజిస్టర్ అయిన తర్వాత ఏడాది లేదా రెండేళ్లలో విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్టు ఆదివారం ఈడీ వెల్లడించింది. సంక్లిష్ట అంశాలతో కూడిన కేసులకు ఈ గడువు నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టం చేసింది. గతేడాది డిసెంబరు 19-21 తేదీల్లో అసోం రాజధాని గువహటిలో ఈడీ డైరెక్టర్ రాహుల్ నవీన్ అధ్యక్షతన జరిగిన జోనల్ ఆఫీసర్ల త్రైమాసిక సదస్సులో దీనిపై చర్చించి, ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. "పెండింగ్ కేసులను పూర్తి చేసేందుకు సరికొత్త లక్ష్యాలు, కాలపరిమితి విధించాం. దర్యాప్తు అధికారులకు అవసరమైన అధికారాలు ఇచ్చాం. సవాల్‌గా మారుతున్న డిజిటల్ అరెస్టు, సైబర్ నేరాలు, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ వంటి కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించాం"అని ఈడీ వెల్లడించింది.

# గ్లోబల్ ఈవెంట్‌లో నగ్న రాజకీయాలా..?

## ఇప్పటికే నిస్సిగ్గుగా ఉన్నారు.. ఇంకా చొక్కాలు విప్పడమెందుకో?

## ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ కార్యకర్తల తీరుపై మీరట్ సభలో మోదీ ధ్వజం




**మీరట్ :** దేశ రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఇండియా కృత్రిమ మేధ (ఏఐ) ఇంపాక్ట్ సదస్సు విజయవంతం కావడం కాంగ్రెస్ సహించలేకపోతోందని ప్రధాని మోదీ అన్నారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు ఆ సదస్సు వద్ద చొక్కాలు విప్పి హల్‌చల్ చేయడంపై మండిపడ్డారు. కాంగ్రెస్ మురికి, నగ్న రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఆ పార్టీ నిస్సిగ్గుగా మారిందని.. ఇంకా చొక్కాలు విప్పాల్సిన అవసరం ఏముందని ఎద్దేవాచేశారు. ఆదివారం ఆయన యూపీలోని మీరట్‌లో నమో భారత్ రైలును, విస్తరించిన మెట్రో రైలును, రూ.12,930 కోట్లతో పూర్తిచేసిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 'ఏఐ సదస్సు వద్ద కాంగ్రెస్ నిరసన.. ఆ పురాతన పార్టీ సైద్ధాంతిక దివాలాకోరుతనానికి, పతనానికి నిదర్శనం. సొంత దేశాన్నే అప్రతిష్ఠ పాల్జేస్తోంది. కాంగ్రెస్ నేతలు నన్ను ద్వేషిస్తున్నారు. నాకు సమాధి తవ్వాలనుకుంటున్నారు. చివరకు నా తల్లిని అవమానించేందుకూ వెనుకాడడం లేదు. కానీ, ఏఐ సదస్సు బీజేపీ కార్యక్రమం కాదని వారు గుర్తుంచుకోవలసింది. ఇది జాతీయ కార్యక్రమం. కాంగ్రెస్ సభ్యత మరచి వ్యవహరించింది. అన్ని హద్దులూ దాటేసింది. వారి ప్రవర్తనను దేశం మొత్తం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనకు సిగ్గుపడాల్సింది పోయి.. దేశాన్ని అవమానించినవారిని హీరోలుగా చిత్రిస్తోంది' అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ కార్యకర్తల తీరును ఖండించిన ప్రతిపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. అవి జాతీయాభిమానం, సత్యం వైపు నిలిచాయని కొనియాడారు. ఒక్క కాంగ్రెస్ నేతలు మాత్రమే ఇలాంటి నిరసనకు దిగారని.. దాని మిత్రపక్షాలైన టీఎంసీ, డీఎంకే, బీఎస్పీ, నేషనల్ కాన్ఫరెన్స్ వంటి పార్టీలకు ప్రమేయం లేదని చెప్పారు. ఈ సందర్భంగా మీడియాకు ఓ సూచన చేశారు. 'ప్రతిపక్షంపై మోదీ విరుచుకుపడ్డారు' వంటి శీర్షికలు పెట్టొద్దని.. తద్వారా కాంగ్రెస్‌ను కాపాడే ప్రయత్నం చేయొద్దని కోరారు.

### పార్లమెంటును అడ్డుకుంటున్నారు..

హద్దూ అదుపూలేని, ఉన్మాద కాంగ్రెస్ నేతలు దేశాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని మోదీ ధ్వజమెత్తారు. 'ఆ పార్టీ పార్లమెంటును స్తంభింపజేస్తోంది. ఈ నెల మొదటివారంలో లోక్‌సభలో ప్రధాని కుర్చీని కాంగ్రెస్ ఎంపీలు చుట్టుముట్టారు.

ఆ పార్టీ నేతలు సభలో మాట్లాడరు.. మిత్రపక్షాలనూ మాట్లాడనివ్వడం లేదు. పార్లమెంటును అడ్డుకోవడం వల్ల కాంగ్రెస్ మిత్రులే ఎక్కువగా ఇబ్బందిపడుతున్నారు. కాంగ్రెస్ ఈ దేశానికి భారంగా మారింది. ప్రధాని కుర్చీలో కూర్చోవాలనుకుంటే మొదట ప్రజల హృదయాలను గెలవాలి. ఆ కుర్చీని ఆక్రమించుకోవడానికి మహిళా ఎంపీలను పంపితే మీరు ప్రధాని కాలేరు' అని మోదీ ఎద్దేవా చేశారు.

# కృత్రిమ మేధ వినియోగంలో ఏఐ సదస్సు టర్నింగ్ పాయింట్

## మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** భవిష్యత్తులో కృత్రిమ మేధ(ఏఐ)ను ప్రపంచం ఎలా ఉపయోగించనుందనే విషయంలో భారతదేశం నిర్వహించిన ఐఏ ఇంపాక్ట్ సదస్సు ఒక టర్నింగ్ పాయింట్‌గా నిరూపణ అయ్యిందని ప్రధాని మోదీ తెలిపారు. మన ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆకట్టుకున్నాయన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం రేడియో ద్వారా నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. సదస్సులో ప్రత్యేకించి రెండు ఆవిష్కరణలు ఎక్కువగా ఆకట్టుకున్నాయని చెప్పారు. వాటిలో ఒకటి అమూల్ కేంద్రం కాగా, మరొకటి భారత సంస్కృతి పరిరక్షణకు సంబంధించినదని తెలిపారు. జంతువుల చికిత్సలో కృత్రిమ మేధ ఎలా ఉపయోగపడుతోందో, తమ పశువులు ఎక్కడున్నాయో 24/7 ఏఐ అసిస్టెంట్ సాయంతో రైతులు ఎలా కనుగొంటున్నారనే విషయాలను అమూల్ బూత్‌లో చక్కగా వివరించారని మోదీ ప్రశంసించారు. అలాగే, నేటి తరానికి అందుబాటులో ఉండేలా భారత పురాతన గ్రంథాలు, పరిజ్ఞానం, రాతప్రతులను పరిరక్షించడంలో కృత్రిమ మేధ ఎలా ఉపయోగపడుతోందో చూసి ప్రపంచ నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. భారత్‌లో తయారైన మూడు ఏఐ మోడళ్లను కూడా సదస్సులో ఆవిష్కరించామని పేర్కొన్నారు. మరోవైపు, టీ-20 ప్రపంచ కప్ క్రికెట్‌లో భారత సంతతికి చెందిన ఆటగాళ్లు అనేక దేశాల తరఫున ఆడుతుండటం సంతోషకరమని మోదీ పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా మానసిక బానిసత్వం నుంచి కూడా స్వాతంత్ర్యం పొందడం అవసరమని మోదీ అన్నారు. ఇందులో భాగంగానే బానిసత్వ చిహ్నాలను దేశం త్యజిస్తోందన్నారు. ఆ దిశగా రాష్ట్రపతిభవన్ కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. రాష్ట్రపతిభవన్‌లోని బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లుటియెన్స్ విగ్రహాన్ని తొలగించి, ఆ స్థానంలో స్వతంత్ర భారత మొట్టమొదటి గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా బ్రిటిష్ పాలకుల విగ్రహాలు రాష్ట్రపతిభవన్‌లో ఉండటం దురదృష్టకరమన్నారు. కాగా, కేరళకు చెందిన 10నెలల చిన్నారి ఆలిన్ షెరిన్ అవయవదానంతో నలుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించడాన్ని మోదీ ప్రశంసించారు.

# మావోయిస్టు అగ్రనేత లొంగుబాటు!

## దేవ్‌జీ పాటు మల్లా రాజిరెడ్డి సహా 25 మంది కూడా..

## తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు

## ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం వెల్లడి

## నేడో, రేపో రాష్ట్ర పోలీసుల ప్రకటన

## సీఎం రేవంత్ సమక్షంలో లొంగుబాటును చూపే అవకాశం



**హైదరాబాద్ :** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర కమిటీ సభ్యుడైన నర్సింహారెడ్డితో పాటు మొత్తం 25 మంది ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ లొంగుబాటును రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి నిర్ధారించారు. దేవ్‌జీతో పాటు మరికొందరు మావోయిస్టులు తెలంగాణ పోలీసులకు లొంగిపోయారని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం కూడా చెప్పారు. మావోయిస్టు పార్టీకి చెందిన కేంద్ర, రాష్ట్ర కమిటీల్లో తెలంగాణ వ్యక్తులు 15 మంది ఉన్నారని.. వారంతా లొంగిపోవాలని ఇటీవల రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి సూచించారు. వాస్తవానికి మల్లోజుల లొంగుబాటు తర్వాత వరసగా వివిధ స్థాయిల్లో ఉన్న మావోయిస్టు క్యాడర్ లొంగుబాటుకు తెలంగాణను వేదికగా చేసుకున్నారు. ఇదే క్రమంలో గత కొన్నాళ్లుగా కరీంనగర్‌కు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, రాజిరెడ్డిల లొంగుబాటుకు సానుకూల వాతావరణం కల్పించాలని ప్రజాసంఘాల నేతలు, మేధావులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇటీవల ఆపరేషన్ కర్రెగుట్టల పేరిట వేలాది సాయుధ బలగాలను రంగంలో దింపి కేంద్రం మరోసారి మావోయిస్టుల మీద తీవ్ర ఒత్తిడి తెచ్చింది. దీంతో ప్రాణహాని లేకుండా చూస్తే లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నామనే సంకేతాలు దేవ్‌జీ తదితరుల నుంచి వచ్చినట్లు తెలుస్తోంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన మావోయిస్టుల్లో దేవ్‌జీ అంగరక్షకులు నలుగురు ఉండడం అనుమానాలకు తావిచ్చింది. ఆయన కదలికల సమాచారం నిఘా వర్గాలకు ఎప్పటికప్పుడు అందుతుందనే అనుమానాలు దీంతో బలపడ్డాయి. కాగా, మావోయిస్టుల లొంగుబాటును సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చూపాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దేవ్‌జీ లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ శకం ముగిసినట్లేనని ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. మరోవైపు మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి ఆచూకీ ఇంకా లభించలేదని సమాచారం. ఆయన విదేశాలకు వెళ్లిపోయారనే ప్రచారం జరుగుతోంది.

### దేవ్‌జీ ఆయుధాల తయారీలో దిట్ట

జగిత్యాల జిల్లా కోరుట్లలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన తిప్పిరి వెంకట నర్సయ్య, గంగుబాయికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. వారిలో తిరుపతి పెద్ద కుమారుడు. తిరుపతి ఇంటర్మీడియట్ వరకు కోరుట్లలో చదువుకున్నారు. కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న సమయంలో 1984లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. క్రమంగా మావోయిస్టు దళ నాయకుడిగా ఎదిగారు. దేవ్‌జీకి ఆయుధాల తయారీలో దిట్ట అనే పేరుంది. మావోయిస్టు మహిళా నాయకురాలు, నల్లగొండ జిల్లాకు చెందిన సృజనను అజ్ఞాతంలోఉన్నప్పుడే పెళ్లి చేసుకున్నారు. పోలీసు ఎన్‌కౌంటర్‌లో ఆమె మృతిచెందారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి 2025 సెప్టెంబరులో నియమితులయ్యారు. ఇదిలా ఉండగా, పెదనాన్న దేవ్‌జీ తమకు కొండంత ధైర్యమని ఆయన తమ్ముడి కూతురు సుమ అన్నారు. అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలుస్తున్నాడన్న సమాచారంతో దేవ్‌జీ తమ్ముడు గంగాధర్, సుమ భావోద్వేగానికి లోనయ్యారు.

### మల్లా రాజిరెడ్డి లొంగుబాటు

మావోయిస్టు పార్టీ తొలితరం అగ్రనేత మల్లా రాజిరెడ్డి అలియాస్ సత్తన్న అలియాస్ సంగ్రామ్ పోలీసులకు లొంగిపోయారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని శాస్త్రులపల్లికి చెందిన రాజిరెడ్డి మంథనిలో ఇంటర్ చదువుతూ 1975లో పీపుల్స్‌వార్ అనుబంధ ఆర్ఎస్‌యూ ద్వారా విప్లవ రాజకీయాల్లో చేరారు. అనంతరం పీపుల్స్‌వార్ మంథని దళంలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. దళ సభ్యుడిగా చేరిన రాజిరెడ్డి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో స్థాయికి ఎదిగారు.

# వరుస విజయాలకు దక్షిణాఫ్రికా బ్రేక్

## 111 పరుగులకు ఆలౌట్

## యాన్సెన్, మహారాజ్ విజృంభణ

## సూపర్-8లో సఫారీల ప్రతీకారం







అహ్మదాబాద్ : ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ వరుస విజయాలకు దక్షిణాఫ్రికా బ్రేక్ వేసింది. సూపర్-8లో భాగంగా ఆదివారం జరిగిన తమ తొలి పోరులో టీమ్ఇండియా 76 పరుగుల తేడాతో సఫారీల చేతిలో ఘోరంగా ఓటమిపాలైంది. గ్రూపు దశలో అపజయమెరుగని సూర్యకుమార్‌యాదవ్ నేతృత్వంలోని టీమ్ఇండియా.. కీలకమైన సూపర్-8లో తేలిపోయింది. దీంతో పొట్టి ఫార్మాట్‌లో వరుసగా 12 విజయాలకు ఫుల్‌స్టాప్ పడగా, గత ప్రపంచకప్ ఫైనల్లో ఎదురైన ఓటమికి దక్షిణాఫ్రికా దీటైన ప్రతీకారం తీర్చుకుంది. సఫారీలు నిర్దేశించిన 188 పరుగుల లక్ష్యఛేదనలో టీమ్ఇండియా 18.5 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌటైంది. యాన్సెన్(4/22), కేశవ్ మహారాజ్(3/24), కార్బన్ బాశ్(2/12) విజృంభణతో టీమ్ఇండియా బ్యాటింగ్ కుదేలైంది. దూబే(42) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోంది. హ్యాట్రిక్ డక్‌లతో పేలవ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ అభిషేక్‌శర్మ(15) ఎట్టకేలకు మెగాటోర్నీలో పరుగుల ఖాతా తెరువగా, ఈసారి ఇషాన్ కిషన్(0) తన వంతు అంటూ సున్నా చుట్టాడు. తిలక్‌వర్మ(1) మరోమారు విఫలం కాగా, మిడిలార్డర్‌లో సూర్యకుమార్(18), సుందర్(11), హార్దిక్(18), రింకూ(0) ఘోరంగా విఫలమయ్యారు. పిచ్ పరిస్థితులకు తగ్గట్లు సఫారీ బౌలర్లు స్లో బాల్స్‌తో టీమ్ఇండియా వికెట్ల వేట కొనసాగించారు. ముఖ్యంగా యాన్సెన్, ఎంగ్డి భారత బ్యాటర్లకు కళ్లెం వేయగా, మహారాజ్ ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి భారత గెలుపు ఆశలపై నీళ్లు చల్లాడు. అంతకుముందు మిల్లర్(35 బంతుల్లో 63, 7ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు బ్రెవిస్(45), స్టబ్స్(44) రాణించడంతో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 187/7 స్కోరు చేసింది. బుమ్రా(3/15), అర్ష్‌దీప్(2/28) ఆకట్టుకున్నారు. మిల్లర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

### బుమ్రా ధమాకా

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాను టీమ్ఇండియా స్పీడ్‌స్టర్ బుమ్రా బెంబేలెత్తించాడు. ఓ ఫోర్‌తో దూకుడు మీదే కనిపించిన సఫారీ ఓపెనర్ క్వింటన్ డికాక్(6) బుమ్రా రెండో ఓవర్‌లో క్రాస్ బ్యాట్ షాట్ ఆడబోయి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత తన వంతు అంటూ అర్ష్‌దీప్‌సింగ్ చేరిపోయాడు. మరుసటి ఓవర్‌లోనే కెప్టెన్ మార్క్మ్(ర4)ను ఊరించే బంతితో బోల్తా కొట్టించాడు. మిడాఫ్‌లో షాట్ కోసం ప్రయత్నించిన మార్క్మ్ హార్దిక్ పాండ్యా చేతికి లడ్డులా చిక్కాడు. క్రీజులోకి వచ్చి రావడంతోనే భారీ సిక్స్‌తో ఊపుమీద కనిపించిన రికల్టన్(7) ఉసూరుమనిపించాడు. బుమ్రా స్లో బంతిని ఆడబోయిన రికల్టన్..దూబే క్యాచ్ ఇచ్చి వెనుదిరుగడంతో దక్షిణాఫ్రికా నాలుగు ఓవర్లు ముగిసే సరికి 3 వికెట్లు కోల్పోయి 20 పరుగులకు పరిమితమైంది. టాపార్డర్ ఘోరంగా విఫలం కాగా, ఇన్నింగ్స్‌ను సీనియర్ బ్యాటర్ మిల్లర్, బ్రెవిస్ చక్కదిద్దారు. బౌలింగ్ మార్పుగా వచ్చిన వరుణ్‌తో పాటు అర్ష్‌దీప్‌ను లక్ష్యంగా చేసుకుంటూ మిల్లర్ వరుస బౌండరీలతో జోరు కనబరిచాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి దక్షిణాఫ్రికా 41 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది.

### మిల్లర్, బ్రెవిస్ రాణించగా

సహచరులు విఫలమైన చోట మిల్లర్, బ్రెవిస్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. మిల్లర్ మంచి పరిణతి కనబర్చగా, బ్రెవిస్ దూకుడు మీద కనిపించాడు. మరోమారు బౌలింగ్‌కు వచ్చిన వరుణ్‌ను ఈసారి మిల్లర్, బ్రెవిస్ గట్టిగా అరుసుకున్నారు. మిల్లర్ సిక్స్ కొడితే తానేం తక్కువ కాదన్నట్లు బ్రెవిస్ ఓ ఫోర్, సిక్స్ కొట్టడంతో 9వ ఓవర్‌లో 17 పరుగులు వచ్చి చేరాయి. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని విడదీసేందుకు కెప్టెన్ సూర్యఎన్ని రకాలుగా ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. పసలేని దూబే బౌలింగ్‌లో బ్రెవిస్ కండ్లు చెదిరే రీతిలో ఫోర్, సిక్స్ కొట్టడంతో దక్షిణాఫ్రికా 100 పరుగుల మార్క్ అందుకుంది. వీరిద్దరు రన్‌రేట్ 9కి ఏమాత్రం తగ్గకుండా పరుగులు కొల్లగొట్టారు. దూబే 13వ ఓవర్‌లో అప్పటికే సిక్స్ కొట్టిన బ్రెవిస్ మరో షాట్ ఆడే క్రమంలో డీప్ మిడ్‌వికెట్‌లో అభిషేక్ చేతికి చిక్కడంతో నాలుగో వికెట్‌కు 97 పరుగుల విలువైన భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఈ క్రమంలో సిక్స్‌తో అర్ధసెంచరీ మార్క్ అందుకున్న మిల్లర్‌కు స్టబ్స్ చక్కని సహకారం అందించాడు. వరుణ్ 16వ ఓవర్‌లో షాట్ ఆడే ప్రయత్నంలో మిల్లర్ ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత యాన్సెన్(2),బాశ్(5) వెంటవెంటనే ఔటైనా..స్టబ్స్ ఆఖర్లో సిక్స్‌లతో సఫారీలు భారీ స్కోరు అందుకున్నారు.

1 ఐసీసీ మెగాటోర్నీల్లో గత 18 మ్యాచ్‌ల్లో భారత్‌కు ఇది తొలి ఓటమి. చివరిసారి అహ్మదాబాద్‌లో జరిగిన 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓడింది.

సంక్షిప్త స్కోర్లు:

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 187/7(మిల్లర్ 63, బ్రెవిస్ 45, బుమ్రా 3/15, అర్ష్‌దీప్ 2/28),

భారత్: 18.5 ఓవర్లలో 111 ఆలౌట్ (దూబే 42, పాండ్యా 18, యాన్సెన్ 4/22, మహారాజ్ 3/24)

# ఇంగ్లండ్ సూపర్ షో..

## శ్రీలంకపై ఘన విజయం .. జాక్స్, ఆర్చర్ విజృంభణ




పల్లెకిలె : టీ20 ప్రపంచకప్ ప్రస్థానంలో శ్రీలంకపై ఇంగ్లండ్ సంపూర్ణ ఆధిపత్యం కొనసాగుతున్నది. మెగాటోర్నీలో తమ విజయాల రికార్డును 6-1కి పెంచుకుంటూ ఇంగ్లండ్ టీమ్ సెమీస్ దిశగా అడుగులు వేస్తున్నది. ఆదివారం సూపర్-8 తొలి పోరులో ఇంగ్లండ్ 51 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యఛేదనలో లంక 16.4 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. విల్‌జాక్స్(3/22), రషీద్(2/13), ఆర్చర్(2/20) ధాటికి లంక బ్యాటర్లు ఘోరంగా కుదేలయ్యారు. పిచ్ పరిస్థితులను తమ అనుకూలంగా మలుచుకుంటూ ఇంగ్లండ్ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. స్వల్ప ఛేదనలో లంక బ్యాటర్ల ఘోరంగా తడబడ్డారు. సూపర్ ఫామ్‌మీదున్న ఫతుమ్ నిస్సనక(9)ను ఔట్ చేసి ఆర్చర్ ఆదిలోనే లంకను కోలుకోలేని దెబ్బకొట్టాడు. ఇదే దూకుడులో జాక్స్‌ను ప్రవేశపెట్టిన కెప్టెన్ బ్రూక్ మెరుగైన ఫలితం రాబట్టాడు.

ఒకే ఓవర్‌లో పవన్ రత్ననాయకె(0), కమిల్ మిశారె(6)ను ఔట్ చేసి జాక్స్..ఇంగ్లండ్‌కు డబుల్ ధమాకా అందించాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి లంక 34 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. దశున్ శనక(30) కెప్టెన్ ఇన్నింగ్స్ జట్టును గెలుపు తీరాలకు చేర్చలేకపోయింది. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లు ఔట్ కావడంతో శనక ఒంటరిపోరాటం లంక లాభం చేకూర్చలేదు. అంతకుముందు ఓపెనర్ ఫిల్ సాల్ట్(40 బంతుల్లో 62, 6ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీతో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 146/9 స్కోరు చేసింది. ఫామ్‌లేమితో సతమతమవుతున్న సాల్ట్ ఈ మ్యాచ్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిచాడు. దునిత్ వెల్లలాగె(3/26), తీక్షణ(2/21), మదుశనక(2/25) ధాటికి ఇంగ్లండ్ మిడిలార్డర్ ఘోరంగా తడబడింది. బట్లర్(7), బెతెల్(3), బాంటన్(6), బ్రూక్(14), కరన్(11) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. జాక్స్(21) ఒక్కడే అంతోఇంతో బ్యాటు ఝులిపించాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించిన జాక్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

# ఆసియాకప్ విజేత యువభారత్..

## ఫైనల్లో బంగ్లాపై ఘన విజయం

బ్యాంకాక్ : ఏసీసీ మహిళల ఆసియాకప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో యువ భారత్ టైటిల్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో రాధాయాదవ్ నేతృత్వంలోని టీమ్ఇండియా 46 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత తేజల్ హసన్‌బీస్(51 నాటౌట్) అజేయ అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ రాధాయాదవ్(36) రాణించడంతో భారత్ 20 ఓవర్లలో 134/7 స్కోరు చేసింది. బంగ్లా బౌలింగ్ ధాటికి ఒక దశలో 44 పరుగులకే నందిని కశ్యప్(8), దినేశ్ వృందా(19), మిన్నుమణి(0), అనుశ్కశర్మ(8) వికెట్లు కోల్పోయిన జట్టును తేజల్ ఆదుకుంది. రాధాయాదవ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను గాడిలో పడేసింది. వీరిద్దరు బంగ్లా బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ సాధికారిక ఇన్నింగ్స్ ఆడారు. ఐదో వికెట్‌కు 69 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఫహిమా ఖాతూన్(4/25) నాలుగు వికెట్లు పడగొట్టింది. స్వల్ప లక్ష్యఛేదనకు దిగిన బంగ్లా 19.1 ఓవర్లలో 88 పరుగులకు కుప్పకూలింది. ప్రేమ రావత్(3/12), తనూజ కన్వర్(2/11), సోనియా(2/21) బంగ్లా పతనంలో కీలకమయ్యారు. కెప్టెన్ షమీమా సుల్తానా(20) టాప్ స్కోరర్‌గా నిలువగా, మిగతావారు స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. తేజల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.






# కుమారుడికి ప్రేమతో.. రూ.4 కోట్ల కారు గిఫ్ట్

ముంబై: నాలుగేళ్ల తన కుమారుడికి భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అతి ఖరీదైన బహుమతిని అందించాడు. ప్రస్తుతం తల్లి నటాషా స్టాంకోవిచ్‌వద్దే ఉంటున్న ఐదేళ్ల అగస్త్యకు ల్యాండ్‌రోవర్ డిఫెండర్ కారును గిఫ్ట్‌గా ఇవ్వడం వైరల్‌గా మారింది. లగ్జరీ విభాగానికి చెందిన ఈ కారు ధర ఏకంగా రూ. 4 కోట్లు ఉంటుందట. స్థానిక షోరూమ్‌లో తల్లీ కొడుకు కలిసి కారు తాళాలు అందుకున్న ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రెండేళ్ల క్రితం హార్దిక్ దంపతులు విడిపోగా.. అగస్త్య పెంపకంలో మాత్రం ఇద్దరూ రాజీ పడడం లేదు. ప్రస్తుతం కొత్త ప్రేయసి మహికా శర్మతో పాండ్యా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్న విషయం తెలిసిందే.

# భారత్ ఓటమి

హోబర్ట్ : ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత హాకీ జట్టు వరుస ఓటముల ప్రస్థానం కొనసాగుతున్నది. ఆదివారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో ఆస్ట్రేలియా 5-4తో(పెనాల్టీ షూటౌట్) భారత్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్ల స్కోర్లు 2-2తో సమయ్యాయి. గత మ్యాచ్‌లతో పోల్చుకుంటే ఆసీస్‌తో పోరులో టీమ్ఇండియా మెరుగైన పోరాట పటిమ కనబరిచింది.

భారత్ తరఫున అమిత్ రోహిదాస్(15ని), జుగ్‌రాజ్‌సింగ్(43ని) చెరో గోల్ చేయగా, జోయల్ రింటాల(47ని, 56ని) ఆసీస్‌కు డబుల్ గోల్స్ అందించాడు. అయితే విజేతను నిర్ణయించేందుకు అనివార్యమైన పెనాల్టీ షూటౌట్‌లో భారత్‌పై ఆసీస్‌దే పైచేయి అయ్యింది. ఈ మ్యాచ్‌కు ముందు ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో టీమ్ఇండియా వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైంది.



# 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2026 తెలుగు విజేతలు



70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2026 వేడుక ఫిబ్రవరి 21న కేరళలోని కొచ్చిలో అత్యంత వైభవంగా జరిగింది. -పుష్ప 2: ది రూల్- చిత్రంతో అల్లు అర్జున్ మరోసారి తన సత్తా చాటారు. ఈ వేడుకలో తెలుగు సినిమాకు సంబంధించిన పూర్తి విజేతల జాబితా ఆసక్తిని కలిగించింది. తెలుగు విజేతల వివరాలు పరిశీలిస్తే... ఉత్తమ చిత్రం- పుష్ప 2: ది రూల్, ఉత్తమ దర్శకుడు: సుకుమార్ (పుష్ప 2: ది రూల్), ఉత్తమ చిత్రం (విమర్శకులు): లక్కీ బాస్కర్ (వెంకీ అట్లూరి), ప్రధాన పాత్రలో ఉత్తమ నటుడు (మేల్): అల్లు అర్జున్ (పుష్ప 2: ది రూల్) , ఉత్తమ నటుడు (క్రిటిక్స్): తేజ సజ్జా (హను-మాన్), ప్రధాన పాత్రలో ఉత్తమ నటి- నివేథ థామస్ (35 చిన్న కథ కాదు), ఉత్తమ నటి (విమర్శకులు): కాజల్ అగర్వాల్ (సత్యభామ), ఉత్తమ సహాయ నటుడు (మేల్): అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ప్రకటన), ఉత్తమ సహాయ నటుడు (ఫీమేల్): అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి), ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్: దేవిశ్రీ ప్రసాద్: రాంజో ప్రసాద్ శాస్త్రి (చుట్టమల్లె - దేవర: పార్ట్ 1), ఉత్తమ నేపథ్య గాయకుడు (పురుషుడు): శ్రీ కృష్ణ (కుర్చి మడతపెట్టి - గుంటూరు కారం), ఉత్తమ నేపథ్య గాయని (మహిళ): శిల్పా రావు (చుట్టమల్లె - దేవర: పార్ట్ 1), ఉత్తమ డెబ్యూ డైరెక్టర్: యధు వంశీ (కమిటీ కుర్రోళ్లు) ఉత్తమ తొలి పురుషుడు: సందీప్ సరోజ్ (కమిటీ కుర్రోళ్లు) ఉత్తమ తొలి నటి: నయన్ సారిక (గం గం గణేశ), ఉత్తమ కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్ (కూర్చి మడతపెట్టి - గుంటూరు కారం), ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 యాడ్), రామకృష్ణ ఉ మోనికా (పుష్ప 2: ది రూల్) తదితరులు పురస్కారాలు అందుకున్నారు. ప్రధాన విభాగాలైన ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సంగీతం వంటి ముఖ్యమైన అవార్డులను ఈ చిత్రం కొల్లగొట్టింది. పుష్ప మొదటి భాగంతో జాతీయ అవార్డు, ఫిల్మ్‌ఫేర్ అందుకున్న బన్నీ ఇప్పుడు రెండో భాగంతో కూడా -ఉత్తమ నటుడు-గా బ్లాక్ లేడీ(పురస్కారం)ని సొంతం చేసుకుని రికార్డు సృష్టించారు. విమర్శకుల ప్రశంసలు పొందిన -లక్కీ భాస్కర్- ఉత్తమ చిత్రం(క్రిటిక్స్ విభాగం)గా నిలవగా, తేజ సజ్జ , కాజల్ అగర్వాల్ తమ నటనకు గుర్తింపు పొందారు. 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2026లో అల్లు అర్జున్ లాంటి దిగ్గజ హీరో సరసన తేజ సజ్జ లాంటి రైజింగ్ ట్యాలెంట్ పురస్కారం అందుకోవడం నిజంగా గ్రేట్. తన అద్భుతమైన నటనకు గాను తేజ సజ్జా తగిన గుర్తింపు పొందారు. హను-మాన్ చిత్రంలో హనుమంతు అనే సామాన్య యువకుడి నుంచి సూపర్ హీరోగా మారే పాత్రలో ఈ యు-వనటుడు చూపిన ప్రదర్శనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. అందుకే క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ నటుడిగా గౌరవం దక్కింది. తేజ సజ్జా నేడు తన రేంజ్‌ను హనుమాన్ చిత్రంతో ఒక్కసారిగా పాన్-ఇండియా స్థాయికి పెంచుకున్నారు. కేవలం తేజ సజ్జకే కాకుండా, ఈ సినిమా ఫిలింఫేర్ 2026లోని పలు విభాగాల్లో గట్టి పోటీ ఇచ్చింది. విజువల్ ఎఫెక్ట్స్ , మేకింగ్ పరంగా ప్రశాంత్ వర్మ దర్శకత్వానికి కూడా మంచి గుర్తింపు లభించింది. తేజ సజ్జా మిరాయ్ కూడా వచ్చే ఏడాది అవార్డులలో సత్తా చాటుతుందని అంచనాలున్నాయి.



## సౌత్‌లో ప్యాడెడ్ బ్రాలు.. నార్త్‌లో నేపోటిజం పిచ్చి.. తాప్సీ

సౌత్ లో ఆశించిన స్టార్‌డమ్ అందుకోవడంలో తడబడిన తాప్సీ పన్ను, ఉత్తరాదిన మాత్రం తనదైన విలక్షణతతో హవా సాగిస్తోంది. ఇటీవల గ్లామర్ ఎలివేషన్ కంటే, తన మనసుకు నచ్చిన అవకాశాల్ని అందుకుంటోంది. తాప్సీ ఇటీవల ఎంతో కాన్ఫిడెన్స్ తో మాట్లాడుతోంది. తన మాటల మాయాజాలంతో హృదయాల్లోకి దూసుకెళుతోంది. నటి తాప్సీ పన్ను తన తాజా చిత్రం -అస్సీ- ప్రమోషన్లలో నేపోటిజం (వారసత్వం) గురించి, సినీపరిశ్రమలోని పలు కీలక విషయాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా అలియా భట్, సందీప్ రెడ్డి వంగా చిత్రాల గురించి తాప్సీ స్పందించిన తీరు చర్చనీయాంశంగా మారింది. తాప్సీ సంచలన వ్యాఖ్యలను పరిశీలిస్తే... నెపోటిజం గురించి అడిగిన ప్రశ్నకు తాప్సీ చాలా ప్రాక్టికల్‌గా సమాధానమిచ్చారు. నేపో కిడ్ అలియా భట్ గురించి మాట్లాడుతూ -గంగూబాయి కతియావాడి-లో అద్భుతంగా నటించింది. అందుకే అదే దర్శకుడితో తనకు మళ్ళీ అవకాశం వచ్చింది. దీన్ని ఎవరూ నెపోటిజం అనరు.. ఎందుకంటే అక్కడ టాలెంట్ ఉంది.. అని ప్రశంసించింది. అసలు సమస్య ఎప్పుడు వస్తుందంటే.. టాలెంట్ ఉన్నా లేకపోయినా కేవలం ఒకే వర్గం నుంచి వచ్చిన వారికే వరుసగా అవకాశాలు ఇస్తూ ఔట్‌సైడర్లను పట్టించుకోనప్పుడు మాత్రమే అది సమస్యగా మారుతుందని అన్నారు. మీ పోరాటం ఆ నేపో పిల్లలకు ప్రయోజనం చేకూర్చలేదా? మీరు కంగనాతో స్నేహం చేస్తారా? అని ప్రశ్నించగా, నాకు వాళ్ళ గురించి తెలియదు.. కానీ ఎవరో ఒకరు ప్రయోజనం పొంది ఉంటారు. నేను కంగనను కలిసినప్పుడల్లా ఆమె దగ్గరికి వెళ్లి గౌరవంగా పలకరిస్తానని తాప్సీ తెలిపారు. బాలీవుడ్‌లో అవుట్‌సైడర్ల పరిస్థితిపై తాప్సీ ఆవేదన వ్యక్తం చేశారు. మాకు స్టార్‌డమ్ ఎంజాయ్ చేసే స్టేజ్ ఉండదు. మేము ప్రతి సినిమాలో మమ్మల్ని మేము నిరూపించుకోవాల్సిందే. ఒక్క ఫ్లాప్ వచ్చినా మమ్మల్ని పక్కన పెట్టేస్తారని తాప్సీ అన్నారు. పరిశ్రమలో ఇన్‌సైడర్లు ఒకరికొకరు బాగా అండగా నిలుస్తారు. కానీ ఔట్‌సైడర్ల మధ్య కూడా పోటీ ఉంటుంది.. మేము ఒకరినొకరం అంతగా సపోర్ట్ చేసుకోలేము! అని వ్యాఖ్యానించారు. సందీప్ రెడ్డి వంగా చిత్రాలపై వస్తున్న విమర్శలపై తాప్సీ స్పందించారు. సినిమా వాళ్లు కూడా సాధారణ వ్యక్తులే.. వారి క్యారెక్టర్ లెవల్‌లో ఏమీ తేడా ఉండదు. సందీప్ రెడ్డి వంగా -యానిమల్- చిత్రంలో ఒక నెగటివ్ లేదా క్లిష్టమైన పాత్రను చూపించిన విధానాన్ని మెచ్చుకోవాలి. ఇదే రకమైన పాత్రను వేరే నిర్మాత హాస్యాస్పదంగా చూపించి ఉండవచ్చు. కానీ సందీప్ వంగా సినిమాలో దానిని చూపించిన విధానం ప్రశంసనీయం.. అని అన్నారు. దక్షిణాదిలో తరచుగా ప్యాడెడ్ బ్రా ధరించమని చెబుతారు.. సమస్య ఏమిటంటే దర్శకుడు సెట్‌లో ఎవరికి చెప్పాలి. సెట్‌లో ఒక పాటను చిత్రీకరిస్తున్నప్పుడు.. అందరూ తేడాను చూస్తున్నప్పుడు ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో ఊహించుకోండి! అని తాప్సీ అన్నారు. తాప్సీ నటించిన అస్సీ థియేటర్లలో ఆడుతోంది. తదుపరి వో లడ్కీ హై కహాన్, గాంధారి, హసీన్ దిల్‌రుబా 3 వంటి చిత్రాలలో నటిస్తోంది.

## అంజనాద్రిలో 'జై హనుమాన్'..



బ్లాక్ బస్టర్ మూవీ హనుమాన్ సీక్వెల్ జై హనుమాన్ ప్రాజెక్ట్ తాజాగా ప్రారంభమైంది. సూపర్ హీరో, భక్తి, ఇతిహాసం ఎలిమెంట్స్ తో కూడిన స్టోరీతో రూపొందుతున్న ఆ చిత్రం పూజా కార్యక్రమాలు కర్ణాటకలో హంపి సమీపంలోని పవిత్ర క్షేత్రం అంజనాద్రి బెట్ట వద్ద గ్రాండ్ గా నిర్వహించారు మేకర్స్. మూవీ టీమ్ అంతా పాల్గొనగా, ఆ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే తక్కువ బడ్జెట్ తో రూపొందిన హనుమాన్ మూవీ బాక్సాఫీస్ వద్ద అంచనాలను మించి వసూళ్లు సాధించి.. సుమారు రూ.400 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. భక్తి నేపథ్యంలో సూపర్ హీరో కాన్సెప్ట్ తో తీసిన ఆ సినిమా క్లైమాక్స్ లో హనుమంతుడి పాత్రను చూపించిన తీరు ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. అదే స్టోరీని కాస్త పెంచి, భారీ స్థాయిలో ఇప్పుడు జై హనుమాన్ ను రూపొందిస్తున్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ రూపొందిస్తున్న ఆ చిత్రం ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వస్తోంది. శ్రీరాముడికి హనుమంతుడు ఇచ్చిన మాట, ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి చేసిన యాత్ర అనే ఇంట్రెస్టింగ్ స్టోరీ లైన్ తో కథ సాగనుందని తెలుస్తోంది. అయితే అంజనాద్రి బెట్టలో పూజలు నిర్వహించడానికి ప్రత్యేక కారణం కూడా ఉంది. పురాణాల ప్రకారం ఇదే హనుమంతుడు జన్మస్థలం అని విశ్వసిస్తారు. కొండపై ఉన్న హనుమాన్ ఆలయానికి చేరుకోవాలంటే దాదాపు 575 మెట్లు ఎక్కాల్సి ఉంటుంది. అక్కడ రాతితో చెక్కిన హనుమంతుడి విగ్రహం, సమీపంలో సీతారాముల ఆలయాలు భక్తులను ఆకట్టుకుంటాయి. అలాంటి ఆధ్యాత్మిక వాతావరణంలో షూటింగ్ ను ప్రారంభించడం ద్వారా సినిమాకు మంచి కలుగుతుందని మేకర్స్ భావించారు! ఏదేమైనా జై హనుమాన్ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. మరి ఆ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో.. ఎలాంటి హిట్ అవుతుందో చూడాలి.



## నిధి అగర్వాల్.. మళ్లీ శివాజీకి కౌంటరా?

హీరోయిన్ల డ్రెస్సింగ్ పై సీనియర్ యాక్టర్ శివాజీ చేసిన కామెంట్స్.. సోషల్ మీడియాలో మళ్లీ పెద్ద చర్చకు దారి తీశాయి. ఆ వ్యాఖ్యలకు పరోక్షంగా హీరోయిన్ నిధి అగర్వాల్ మరోసారి స్పందించిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. గతంలో శివాజీ పేరు ఎత్తకుండా ఇన్ స్టాగ్రామ్ స్టోరీ పెట్టగా.. ఇప్పుడు పబ్లిక్ అప్పియరెన్స్ తో మళ్లీ కౌంటర్ ఇచ్చారని అంతా అభిప్రాయపడుతున్నారు. అసలేం జరిగిందంటే.. ఇటీవల జరిగిన దండోరా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో శివాజీ మాట్లాడుతూ హీరోయిన్లు పబ్లిక్ ఈవెంట్లకు వెళ్లేటప్పుడు కాస్త ట్రెడిషనల్ గా డ్రెస్సులు ధరించాలని సూచించారు. కొన్నిసార్లు అభ్యంతరకరమైన డ్రెస్సింగ్ వల్ల అభిమానులు అత్యుత్సాహంగా ప్రవర్తించే అవకాశముందని అభిప్రాయపడ్డారు. దీంతో ఆయన కామెంట్స్ పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మహిళల దుస్తుల కారణంగా చూపించడం సరైనది కాదని పలువురు నెటిజన్లు, సినీ ప్రముఖులు అభ్యంతరం వ్యక్తం చేశారు. విమర్శలు పెరగడంతో శివాజీ తర్వాత తన మాటల వల్ల ఎవరైనా నొచ్చుకుంటే క్షమించాలని చెప్పారు. ఆ సందర్భంగా గతంలో జరిగిన కొన్ని ఘటనలను ప్రస్తావించారు. ముఖ్యంగా నిధి అగర్వాల్‌కు జరిగిన అసౌకర్యకర అనుభవాలు తనను కలచివేశాయని తెలిపారు. అందుకే జాగ్రత్తగా ఉండాలని చెప్పానని వివరణ ఇచ్చారు. హైదరాబాద్ లోని లులు మాల్ లో నిధి ఎదుర్కొన్న ఘటనను కూడా గుర్తు చేశారు. అలాగే హీరోయిన్ సమంతకు ఈవెంట్లలో ఎదురైన ఇబ్బందులు ప్రస్తావించారు. అయితే ఆ వ్యాఖ్యల తర్వాత నిధి అగర్వాల్ తన ఇన్ స్టాగ్రామ్ లో చేసిన పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షించింది. బాధితురాలిని నిందించడం సానుభూతి కాదని, అలాంటి వ్యాఖ్యలు తప్పుదోవ పట్టిస్తాయంటూ స్టోరీ పెట్టారు. ఎవరినీ నేరుగా ఉద్దేశించకపోయినా, ఆ పోస్ట్ శివాజీ కామెంట్స్ కు కౌంటర్ గా భావిస్తూ నెటిజన్లు చర్చించుకున్నారు. అదే సమయంలో రీసెంట్ గా నిధి ఒక ఈవెంట్ కు స్టైలిష్ మోడ్రన్ డ్రెస్ లో హాజరైన వీడియో వైరల్ అవుతోంది. దీంతో డ్రెస్సింగ్ తోనే తన సమాధానంగా చూపించిందంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మహిళలు ఏ దుస్తులు ధరించాలో వారి వ్యక్తిగత ఎంపిక అని, దానిని తప్పుబట్టడం సరైంది కాదని పలువురు మద్దతు తెలుపుతున్నారు.

# వడ్డీ భారం..



## కూలుతున్న కుటుంబాలు...

## రికవరీ ఒత్తిడిపై ఆందోళనలు

### ఒక ఫోన్ కాల్‌తో మొదలైన భయం... వడ్డీ ఒత్తిడితో వణికిన కుటుంబం

### రుణ వసూళ్ల ఒత్తిడిపై రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న ఫిర్యాదులు

### చట్టాల అమలు, పర్యవేక్షణపై ప్రశ్నలు



**యాంసాని శివ కుమార్ (ఎడిటర్) / హుస్నాబాద్, జనతా న్యూస్:**

**అర్ధరాత్రి వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో మొదలైన వేధింపులు ఒక కుటుంబాన్ని తీవ్ర మానసిక ఒత్తిడిలోకి నెట్టాయి. భర్త తీసుకున్న అప్పుకు సంబంధించి తనకు నేరుగా సంబంధం లేకపోయినా, ఒక విద్యాసంస్థలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగికి వరుసగా ఫోన్ కాల్స్ రావడం ప్రారంభమైంది. రోజులో అనేకసార్లు, అర్ధరాత్రి వేళల్లో కూడా కాల్స్ చేస్తూ దుర్భాషలాడటం, సహోద్యోగులు, బంధువులకు ఫోన్ చేసి ఒత్తిడి తీసుకురావడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. చివరకు ఆమె పోలీసులను ఆశ్రయించగా, ఫిర్యాదు స్వీకరించిన అధికారులు సంబంధిత నంబర్లపై చర్యలు తీసుకుని వేధింపులను నిలిపివేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న ఈ ఘటనలో వన్‌టౌన్ పోలీసులు చూపిన చొరవ ప్రశంసనీయం....**

ఈ ఘటన ఒక్కటే కాదు. అత్యవసర అవసరాల కోసం తీసుకున్న చిన్న మొత్తాల అప్పులు కొన్నిసార్లు కుటుంబాలపై భారీ ఒత్తిడిగా మారుతున్నాయని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు. ముఖ్యంగా తక్కువ ఆదాయ వర్గాలు, చిన్న రైతులు, కూలీలు బ్యాంకుల నుంచి రుణాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొనడంతో ప్రైవేట్ అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతోందని తెలుస్తోంది.

పలు ప్రాంతాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, కొంతమంది రుణదాతలు అధిక వడ్డీ రేట్లు విధించడం, రుణం ఇవ్వడానికి ముందు ఖాళీ చెక్కులు లేదా పత్రాలు తీసుకోవడం, వాయిదాలు ఆలస్యమైతే తరచూ కాల్స్ చేయడం వంటి అంశాలపై ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యులకు కూడా కాల్స్ వెళ్లడం, మానసిక ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని బాధితులు చెబుతున్నారు.

### వాయిదా దాటితే ఇంటిముందు నరకం

ప్రైవేట్ సంస్థల వికృత రూపం వసూళ్లలోనూ కనిపిస్తోందని బాధితులు చెబుతున్నారు. వాయిదా ఒక్కరోజు ఆలస్యమైనా ఇళ్ల ముందుకు వచ్చి రభస సృష్టించడం, కుటుంబాల పరువును దెబ్బతీయడం జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల గడువు ముగిసిన కొద్ది రోజులకే గుంపులుగా వెళ్లి ఒత్తిడి తేవడం, చెక్‌బౌన్స్ పేరుతో అదనపు మొత్తాలు డిమాండ్ చేయడం వంటి అంశాలు వినిపిస్తున్నాయి. “అప్పు ఇచ్చేముందే అన్ని ష్యూరిటీలు ఇచ్చాం.. అయినా మమ్మల్ని దొంగల్లా చూస్తున్నారు” అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. మహిళలు, కుటుంబ సభ్యులపై కూడా అనుచితంగా మాట్లాడుతున్నారని కొందరు కన్నీరు పెట్టుకుంటున్నారు.

### బ్యాంకు రుణాల లేమి - ప్రైవేట్ అప్పులకు దారి

సిబిల్ స్కోర్, పూచీకత్తు వంటి ప్రమాణాల వల్ల అత్యవసర పరిస్థితుల్లో బ్యాంకు రుణాలు అందుబాటులోకి రావడం కష్టమవుతోందని పలువురు చెబుతున్నారు. వైద్య చికిత్సలు, పంట పెట్టుబడులు, కుటుంబ అవసరాల కోసం తక్షణంగా డబ్బు అవసరమైనప్పుడు కొందరు ప్రైవేట్ రుణాలను ఆశ్రయిస్తున్నారు. కొన్నిసార్లు బ్యాంకులు కూడా రికవరీ ప్రక్రియను థర్డ్ పార్టీ ఏజెన్సీలకు అప్పగిస్తున్నట్లు సమాచారం. దీనివల్ల రుణగ్రహీతలపై ఒత్తిడి పెరుగుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.






### గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ వడ్డీ వ్యవస్థ -- మారుతున్న స్వరూపం

గ్రామీణ ప్రాంతాల్లో పూర్వకాలం నుంచే చిన్న వ్యాపారులు, స్థానిక వడ్డీదారులను ఆశ్రయించే పద్ధతి కొనసాగుతోంది. నమ్మకం ఆధారంగా ఇచ్చిపుచ్చుకునే ఆర్థిక వ్యవస్థలో చిన్నచిన్న చిట్టీలు కూడా భాగమైందని పెద్దలు చెబుతున్నారు. అయితే ఇటీవల కొన్ని చోట్ల ఈ వ్యవస్థ దుర్వినియోగం అవుతున్నట్లు సమాచారం. చిట్టీలను ముందుగానే లిఫ్ట్ చేసి పెద్ద మొత్తాలు తీసుకోవడం, తర్వాత చెల్లింపుల విషయంలో వివాదాలు తలెత్తడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొంతమంది చట్టపరమైన అంశాలను చూపిస్తూ బెదిరింపులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంప్రదాయ నమ్మకంపై నడిచే వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా బ్యాంకులేని కాలం నుండి ఎంతో మందికి ఆసరాగా నిలబడిన వ్యవస్థలు కుప్పకూలుతున్నాయి. ఇలాంటి వారి వల్ల నిజాయితీ గా కట్టే వారికి కూడా అప్పులు పుట్టడం లేదు.దీంతో కొంత మంది ప్రైవేట్ ఫైనాన్స్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

### చట్టాలు ఉన్నా అమలుపై ప్రశ్నలు

రుణ వసూళ్లలో వేధింపులు, బెదిరింపులు చేయడం చట్టపరంగా నేరమని న్యాయ నిపుణులు గుర్తుచేస్తున్నారు. లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారం చేయడం, రుణగ్రహీతలను మానసికంగా లేదా శారీరకంగా వేధించడం వంటి అంశాలపై ఇప్పటికే చట్టాలు అమలులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అమలు ఎలా జరుగుతోంది అన్న అంశంపై మరింత పర్యవేక్షణ అవసరమని సామాజిక సంస్థలు సూచిస్తున్నాయి.

### బాధితులకు సూచనలు

వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించడం, కాల్స్ లేదా సందేశాలను సాక్ష్యాలుగా భద్రపరచుకోవడం, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రుణ ఒత్తిడితో మానసిక సమస్యలు తలెత్తకుండా కుటుంబ సభ్యులు, స్థానిక సంస్థలు కూడా సహకరించాలని పేర్కొంటున్నారు.

### సమగ్ర పరిష్కారాల అవసరం

ప్రజలకు సులభంగా, తక్కువ వడ్డీతో రుణాలు అందేలా బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. రుణ వసూళ్లలో నిబంధనలు పాటించని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అప్పు అవసరం ఉన్న సామాన్యుడికి రక్షణ కల్పించడం, రుణ వ్యవస్థలో పారదర్శకత పెంచడం, చట్టాల అమలు బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకున్నప్పుడే ఈ సమస్యకు స్థిరమైన పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

*ఈ కథనం పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులు, బాధితుల అనుభవాలు, నిపుణుల అభిప్రాయాల ఆధారంగా సిద్ధం చేయబడింది. సంబంధిత అధికారుల స్పందిస్తే ప్రచురించడానికి సిద్ధంగా ఉన్నాం.*



**యాంసాని శివ కుమార్, ఎడిటర్, జనతా డైలీ**

# కరీంనగర్ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, ఫిబ్రవరి 22: కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఆదివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. తన చాంబర్‌లో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మేయర్ పీఠంపై ఆసీనులయ్యారు.

బాధ్యతలు స్వీకరించిన వెంటనే నగర ప్రజల తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విలీన గ్రామాల డివిజన్లలో రూ.49 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు పరిపాలనాపరమైన మంజూరు ఫైల్‌పై తొలి సంతకం చేశారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, జాతీయ-రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో తొలిసారిగా బీజేపీ మేయర్ పదవి దక్కడం శుభ సూచకమని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పాలకవర్గ సభ్యుల సహకారంతో రాబోయే ఐదేళ్లలో 66 డివిజన్ల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు నగరపాలక సంస్థలో పౌర సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నూతనంగా విలీనమైన గ్రామాల డివిజన్లను సమాంతరంగా అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం





తిమ్మాపూర్, జనతా న్యూస్ తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని పద్మావతి సహిత వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 47 వ బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన వెంకటాచార్యులు , గోవర్ధన శ్రీకాంత్ చార్యుల వేద మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. కళ్యాణ ఘట్టంలో స్వామి వారికి శివాలయ కమిటీ చైర్మన్ చల్లా మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంఘం లక్ష్మణ్ రావు, బట్టు కరుణాకర్ పట్టు వస్త్రాలను, మంచి ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్, మహాత్మా నగర్, తిమ్మాపూర్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. కన్యాదాతలుగా పలువురు దంపతులు పాల్గొన్నారు. పలు సాంస్కృత కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి, కళ్యాణం అనంతరం దైవ దర్శనం చేసుకున్న భక్తులు ఒడి బియ్యం సమర్పించారు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల వసతులను కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఒంటెల రవిందర్ రెడ్డి, కోశాధికారి పోలు కిషన్,హౌఉద్యోగ సంఘాల నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు దారం శ్రీనివాస్ రెడ్డి, గంగారపు రమేష్, ప్రసాద్ రెడ్డి, రాగి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రాజయ్య,

బట్టు కరుణాకర్ , వెంకట్ రెడ్డి, రాంబాబు, వెంకటాచారి, తదితరులు ఉన్నారు.

# "శ్రీకృష్ణుడిగా శ్రీలక్ష్మీనారసింహుడు"

**ఐదో రోజు శ్రీకృష్ణ అలంకార సేవ, పొన్నవాహన సేవ**


**యాదగిరిగుట్టలో ఐదో రోజుకు చేరిన యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు**



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం స్వామివారి శ్రీకృష్ణావతార అలంకార సేవ, పొన్నవాహన సేవను ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యుల అర్చకత్వంలో అర్చకులు, యజ్ఞాచార్యులు, పారాయణికులు కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు 'శ్రీకృష్ణుడు(మురళీకృష్ణుడు)'గా భక్తులను కనువిందు చేసిన నారసింహుడు.. రాత్రి 7 గంటలకు 'పొన్నవాహనం'పై విహరిస్తూ భక్తులను తన్మయపర్చారు. ఈ కైంకర్యాల్లో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో భవానీ శంకర్, డీఈవో భాస్కర్ శర్మ, ఏఈవోలు గజవెల్లి రఘు, మహేష్ తదితరులు ఉన్నారు.

**నేడు గోవర్ధనగిరిధారి, సింహవాహన సేవ**

బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి గోవర్ధనగిరిధారి అలంకార సేవ, సింహవాహన సేవను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు గోవర్ధనగిరిధారి అలంకారంలో స్వామివారిని ఊరేగించి, రాత్రి 7 గంటలకు సింహ వాహనంపై విహరింపజేయనున్నారు.







# రౌడీ రాజ్యం నడుస్తోందా?..

## కాంగ్రెస్‌పై బండి సంజయ్ తీవ్ర విమర్శలు

కరీంనగర్/హైదరాబాద్: రాష్ట్రంలో చట్టవ్యవస్థపై ప్రశ్నలు తలెత్తేలా పరిస్థితులు మారుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ప్రశ్నించిన బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు దిగుతున్నారని ఆయన విమర్శించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నట్లుగా ఉందని, కాంగ్రెస్--ఎంఐఎం కలిసి అరాచకాలు సృష్టిస్తున్నాయని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిపై జరిగిన దాడిని ఆయన అమానుషంగా అభివర్ణించారు. కామారెడ్డి ఘటనలలో కూడా కాంగ్రెస్ పాత్ర ఉందని ఆరోపించారు. బాన్సువాడలో జరిగిన సంఘటనలపై స్పందిస్తూ, 70 మందిని అరెస్ట్ చేయడం అక్రమమని, రాళ్ల దాడి జరిగినా సరైన చర్యలు తీసుకోలేదని అన్నారు. బాన్సువాడకు వెళ్లేందుకు యత్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను బీజేపీ కార్యకర్తలు గమనించాలని, అరాచకాలను అడ్డుకోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, జరిగిన సంఘటనలను ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# సీఎం కప్--2026 రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు ముగింపు




కరీంనగర్, ఫిబ్రవరి 22: ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్--2026 రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ ఛాంపియన్షిప్ విజయవంతంగా ముగిసింది. ఈ నెల 20న ప్రారంభమైన పోటీలకు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం నిర్వహించగా, ఆదివారం ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో ఆల్‌రౌండ్ విజేతలుగా కరీంనగర్‌కు చెందిన సుభాషిణి మోషేష్, యశ్విత, రంగారెడ్డి జిల్లా ఆరాధ్య, శాన్విక, హైదరాబాద్ జిల్లా మేహా, పి.ఆకాశ్, మేడ్చల్ జిల్లా కే.గౌతమ్, జి.సంజీవ్ కుమార్ తదితరులు నిలిచారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో శిక్షణ తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నిరంజన్ చారి, కార్యదర్శి బ్రహ్మాచారి, రిటైర్డ్ డీవైఎస్ఓ శివ, కోచ్‌లు ఇందిరా, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 17 జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

# సిద్దిపేట--కరీంనగర్ జిల్లాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాలు

సిద్దిపేట/కరీంనగర్, ఫిబ్రవరి 22: జిల్లా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి పరిష్కరించేందుకు సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయా జిల్లా కలెక్టర్లు ప్రకటించారు. సిద్దిపేట జిల్లాలో ఈనెల 23వ తేదీ సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజలు తమ వినతులు, సమస్యలను ప్రత్యక్షంగా తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా కరీంనగర్ జిల్లాలో కూడా సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అధికారులు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, అభ్యర్థనలను సంబంధిత అధికారులకు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com